## రిపోర్టర్లు కావలెను

ఎప్పటికప్పుడు వాస్తవ కథనాలను అందిస్తూ అనతికాలంలోనే ప్రజాదరణ పొందిన'తొలి ఆకాంక్ష' దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరోలు, నియోజకవర్గాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, మండల వారిగా కంట్రిబ్యూటర్లు కావలెను.

సెల్ :8333818121.9908333465

మీ బయోడేటా పై నంబర్లకి వాట్సప్ ద్వారా పంపగలరు



RNI.No.TGTEL/25/A1964

# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక



## రిపోర్టర్లు కావలెను


పాఠకులకు అండగా,ప్రశ్నించే గొంతుకగా, ప్రజా చైతన్యమే లక్ష్యంగా మాతవంగా ప్రారంభమైన 'తొలి ఆకాంక్ష' దినపత్రికలో పనిచేయడానికి కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల, మంచిర్యాల,ఖమ్మం, ఆసిఫాబాద్,ఆదిలాబాద్,జగిత్యాల,జయశంకర్ భూపాలపల్లి,కామారెడ్డి, ములుగు, రంగారెడ్డి,భద్రాద్రి కొత్తగూడెం,జోగులాంబ గద్వాల,మహబూబ్‌నగర్,నాగర్‌కర్నూల్, మెదక్, నల్గొండ,నిర్మల్, నారాయణపేట,సూర్యాపేట,వికారాబాద్,వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి,హన్మకొండ జిల్లాల్లో పని చేయడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా

స్టాఫ్ రిపోర్టర్లు మండల నియోజకవర్గ రిపోర్టర్లు కావలెను

Contact Number : 9908333465.8333818121



ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక : 60 ఎడిటర్ :పెనుగొండ సతీష్ ఆదివారం 5 అక్టోబర్ 2025 పేజీలు 8 వెల 5.00




### ఆత్మనిర్భర భారత్‌కు

# ఐటిఐలు కీలకం

- శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సిఎం నితీశ్ కుమార్


(ఆకాంక్ష న్యూస్)

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారి శ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను 2 లో

### దేశం కోసం అవసరమైతే

# మేం సరిహద్దులు దాటుతాం

## - రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 4 : భారత ప్రజల రక్షణ, దేశ సమగ్రత కోసం ఎన్డీయే ప్రభుత్వం సరిహద్దులు దాటేందుకు కూడా సిద్ధంగా ఉందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఢిల్లీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక జారీ చేశారు. దేశానికి ముప్పు వాటిల్లితే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకైనా వెనుకాడబోమని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా నిరూపించామని ఆయన అన్నారు. 2016 సర్జికల్ స్ట్రైక్, 2019 బాలాకోట్ వైమానిక దాడులను కూడా ఆయన ఈ సంద ర్భంగా ఉ దహరించారు. పహల్గామ్‌లో ఉ 2 లో

### రెండు నెలల్లో రీజినల్

# రింగ్ రోడ్డు టెండర్ ప్రక్రియ

- రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదు
- భూసేకరణలో నాటి బిఆర్ఎస్ నిర్లక్ష్యంలో ఆలస్యం
- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

(ఆకాంక్ష న్యూస్)



నల్లగొండ, అక్టోబర్4 : రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ పక్రియ ప్రారంభం కానుం దని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడుతూ.. 2017- 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే.. బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయ కుండా నిర్లక్ష్యం వహించిం దని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని,ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. 4లేన్ల ట్రిపుల్ ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా 2 లో

### ఎర్రగడ్డ డివిజన్‌లో

# పలు అభివృద్ధి కార్యక్రమాలు

## - జూబ్లీహిల్ ఉప ఎన్నికల్లో గెలిపించాలన్న పొన్నం

(ఆకాంక్ష న్యూస్)



హైదరాబాద్, అక్టోబర్4 : కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో ఎలా గెలిపించారో.. జూబ్లీ హిల్స్ లోనూ గెలిపించాలని కార్యకర్తలకు మంత్రి పొన్నం ప్రభాకర్ దిశా నిర్దేశం చేశారు . జూబ్లీహిల్స్ అభివృద్ధి ముఖ్యమంత్రి తీసుకు న్నారని.. కాంగ్రెస్ కు అవకాశం ఇవ్వాలని ఆయన సూచించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనీ ఎర్రగడ్డ డివిజన్ లో హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎర్రగడ్డ డివిజన్ లోని 2.16 కోట్ల రూపాయల వ్యయంతో నటరాజ్ 2 లో

### ప్రయాణికులకు

# ఆర్టీసీ షాక్

- సిటీ బస్సుల్లో ఛార్జీల పెంపు
- సోమవారం నుంచి అమల్లోకి ఛార్జీలు

(ఆకాంక్ష న్యూస్)



హైదరాబాద్, అక్టోబర్ 4 : టీజీఎస్ ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. సిటీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు పేర్కొంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ-ఆర్డినరీ, ఈ-ఎక్స్ ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ-మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీల పెంచుతున్నట్లు చెప్పింది. మొదటి మూడు స్టేజిలకు రూ.5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీల వసూలు చేయనున్నట్లు సమాచారం. మెట్రో డీలక్స్, ఈ-మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ.5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీలు వసూలు చేయనుంది. అయితే.. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. తాజాగా ఛార్జీల పెంపుపై టీజీఎస్‌ఆర్టీసీ స్పందించింది. ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని తేల్చి చెప్పింది. సిటీ 2 లో

# పదేళ్లు ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించారు

## - హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ ఆది శ్రీనివాస్



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 4 : పదేళ్ల పాటు ప్రభుత్వాస్పత్రులను గాలికి వదిలేసి ఇప్పుడు మాకు పాఠాలు చెబుతున్నారని, ఎన్ని కుప్పిగంతులు వేసినా జూబ్లీహిల్స్ ప్రజలు హరీష్ రావు, కేటీఆర్‌లను పట్టించుకోరని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల వాతావరణం దగ్గరపడుతున్న తరుణంలో బీఆర్ఎస్ నేత హరీష్ రావు చర్యలపై ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆస్పత్రులను ఎందుకు నిర్మించలేదో హరీష్‌రావు సమాధానం చెప్పారిలని ఆదిశ్రీనివాస్ అన్నారు. అధికారం పోవడానికి ఏడాది ముందు టిమ్స్ హాస్పిటల్ కోసం టెండర్లు పిలిచారు. కానీ మా ప్రభు త్వం వచ్చాక ముఖ్యమంత్రి వీటిపై ప్రత్యేక దృష్టి సారించడంతో 90 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యా యని అన్నారు. కొత్తపేట టిమ్స్ హాస్పిటల్ నిర్మాణం విషయంలో హరీష్ రావు ఆరోపణలు నిజం కాదని ఆయన తేల్చారు. విదేశాల నుంచి ఆధునిక వైద్య పరిక రాలు రావాల్సి ఉండటంతో కొంత సమయం పడుతోంది. కానీ 2 లో

### చెల్లని బిసి జివోతో

# కాంగ్రెస్ ఎన్నికల ప్రకటన

- ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారు
- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆరోపణ

(ఆకాంక్ష న్యూస్)




జనగామ, అక్టోబర్4 : చట్టపరంగా చెల్లని జీఓ తెచ్చి స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేయాలని చూస్తోం దని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని హరిపిరాల, వెలికట్టే గ్రామాల్లో శనివారం నిర్వహించిన ఎంపీటీసీ క్లస్టర్ సమావేశాలకు ఎర్రబెల్లి ముఖ్య అతిథిగా 2 లో

### జంట జలాశయాలకు

# భారీగా వరదనీరు

- మరోమారు గేట్లు ఎత్తి మూసీలోకి నీటి విడుదల
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 4 : ఎగువనుంచి వరద రావడంతో జంటజలాశయాలకు మరోమారు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో జలమండలి అధికారులు జంట జలాశయాల నుంచి భారీ మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా వాతావరణ శాఖ మరోసారి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో అప్రమత్తమైన జలమండలి అధికారులు జంట జలాశయాలను పరిశీలించి, అవసరమైతే ముందస్తుగా నీటిని విడుదల చేయమని ఆదేశాలు స్వీకరించారు. ఎగువ నుండి ఉస్మాన్ సాగర్‌కు 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నప్పటికీ, 3 గేట్లను తెరిచి 2028 క్యూసెక్కుల నీటిని మూసిలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. హిమాయత్ నగర్ ప్రాంతానికి 400 క్యూసెక్కుల 2 లో

# మరోమారు హైడ్రా దూకుడు

- కొండాపూర్‌లో 36 ఎకరాల్లో ఆక్రమణల కూల్చివేత
- హైకోర్టు తీర్పుతో తాత్కాలిక షెడ్లను కూల్చిన హైడ్రా
- దాదాపు 3600 కోట్ల విలువైన భూమిగా వెల్లడి



(ఆకాంక్ష న్యూస్)

హైదరాబాద్, అక్టోబర్ 4 : భాగ్య నగరంలో హైడ్రా అధికారుల కూల్చి వేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు 2 లో

# అమెరికాలో దుండగుడి కాల్పులు

- హైదరాబాద్ విద్యార్థి చంద్రశేఖర్ మృతి
- సిఎం రేవంత్ దిగ్భ్రాంతి..హరీష్ రావు పరామర్శ

(ఆకాంక్ష న్యూస్)



హైదరాబాద్, అక్టోబర్ 4 : అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో తెలుగు వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్, మీర్‌పేట్ టీచర్స్ కాలనీకి చెందిన 35 ఏళ్ల పోలె చంద్ర శేఖర్ కొన్నేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు 2 లో

# అమెరికాలో దుండగుడి కాల్పులు

మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన తెలుసుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు.బీఎన్‌రెడ్డి నగర్‌లో ఉన్న బాధిత కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాజీమంత్రి హరీశ్‌రావు పరామర్శించారు. ఉన్నత స్థానంలో ఉంటాడనుకున్న కుమారుడు ఇక లేడన్న విషయం తెలిసి తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన చూసి గుండె తరుక్కు పోతోందన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

# మరోమారు హైడ్రా దూకుడు

మొదటిపేజీ తరువాయి

ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని పోలీసులు అనుమతించడం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా భారీగా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కొండాపూర్ లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించడం ద్వారా . దాదాపు 3600 కోట్ల రూపాయల విలువ చేసే 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. దీనిపై గతంలో రైతులకు అనుకూలంగా రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. దీంతో ఉన్నత న్యాయస్థానం సర్కార్ కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పు మేరకు శనివారం ఉదయం నుంచి కొండాపూర్ లోని భిక్షపతి నగర్ ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపును భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు.

# ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

మొదటిపేజీ తరువాయి

బస్సుల్లో మెరుగైన వసతులు కల్పించాలంటే ఛార్జీలు పెంచక తప్పట్లేదు అని వివరించింది. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. సిటీ బస్సుల్లో పెరిగిన ఛార్జీలపై నగరవాసులు సహకరించాలని టీజీఎస్ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలోని వివరాల ప్రకారం.. టీజీఎస్ఆర్టీసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. హైదరాబాద్ భవిష్యత్ బాగు కోసం వాడకంలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సంస్థ కోరుతోంది. ఈ పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి.. గతంలో మాదిరిగానే ఆర్టీసీ సేవలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తోంది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా 10 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు.

# చెల్లని బిసి జివోతో కాంగ్రెస్ ఎన్నికల ప్రకటన

మొదటిపేజీ తరువాయి

హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ బాకీ కార్డులను విడుదల చేసి, ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి నిజంగా ధైర్యం ఉంటే ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డి తన శిష్యుడేనని, కానీ బ్రోకర్ రాజకీయాలు ఆడుతున్నట్లు దుయ్యబట్టారు. మూడుసార్లు గెలవకపోయినా బ్రోకర్ పనులు చేస్తూ ముఖ్యమంత్రి అయ్యాడన్నారు.రెండు సంవత్సరాల క్రితం జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలను తరచూ వాయిదా వేస్తూ గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేసినట్లు తెలిపారు. హైకోర్టు గడువు ఒత్తిడిలోనే ప్రభుత్వం బీసీలపై మొసలి కన్నీరు కారుస్తూ రాజ్యాంగబద్ధం కానీ జీఓను తెచ్చిందన్నారు. బీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు కూడా ఈ జీఓ చెల్లదని చెబుతున్నా, ప్రభుత్వం నోరు మెదపకపోవడం వెనుక దాగివున్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్రకటన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తప్పా మరే ఒక్క మంత్రి, ఎమ్మెల్యే ఎన్నికలపై మాట్లాడక పోవడం కాంగ్రెస్ లోపాలను బయట పెడుతోందన్నారు. ఎన్ని సర్వేలు చేయించినా తీవ్ర ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌పై ఉందని తెలుసుకున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు మోసపూరిత పద్ధతులు అవలంబిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత 22 నెలల్లో ప్రజలకు ఎంత బాకీ పడిందో స్పష్టంగా చూపించేందుకు బీఆర్ఎస్ పార్టీ రూపొందించిన 'కాంగ్రెస్ బాకీ కార్డులను' ఇంటింటికి పంపిణీ చేయాలని పార్టీ శ్రేణులను సూచించారు. ప్రజల అవగాహన పెరిగింది, పాలకుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురడం ఖాయం అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# జంట జలాశయాలకు భారీగా వరదనీరు

మొదటిపేజీ తరువాయి

ఇన్‌ఫ్లో వస్తుండగా, 2 గేట్లను మూడు ఫీట్లు తెరిచి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జంట జలాశయాల నుంచి కలిపి 5000 క్యూసెక్కుల నీటిని జాగ్రత్తగా విడుదల చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి నిర్ణయించారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాల కారణంగా జలాశయాల్లో నీటి స్థాయి పెరుగుతున్న సమయంలో, ముందస్తు జాగ్రత్తల ద్వారా వరదల దెబ్బలు తగ్గించవచ్చని జలమండలి అధికారులు చెబుతున్నారు. పలు ప్రాంతాల ప్రజల భద్రత కోసం నిరంతరం గేట్ల నియంత్రణ, నీటి విడుదలలను సమీకరించడం జరుగుతుంది.

# ఆత్మనిర్భర భారత్‌కు ఐటిఐలు కీలకం

మొదటిపేజీ తరువాయి

ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్ల్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత- కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు.ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్ఠాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలన తో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బడ్జెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. దేశంలోనే బిహార్‌లో అత్యధికయువ జనాభాఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు.

# దేశం కోసం అవసరమైతే మేం సరిహద్దులు దాటుతాం

మొదటిపేజీ తరువాయి

గ్రవాదులు పౌరులను వారి మతం ఆధారంగా కాల్చి చంపారని, అయితే భారత్ మాత్రం మతం కోణంలో'ఆపరేషన్ సిందూర్' చేపట్ట లేదని ఆయన పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు. పాకిస్థాన్ లేదా పీఓకేలో ఏ సైనిక లేదా పౌర సంస్థలపైనా భారత్ దాడి చేయలేదని గుర్తు చేశారు.

# పదేళ్లు ప్రభుత్వాసుపత్రులను భ్రష్టు పట్టించారు

మొదటిపేజీ తరువాయి

పేరు కోసం హడావుడిగా ప్రారంభం చేయాలని మాకు ఉద్దేశం లేదు. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, సూపర్ స్పెషాలిటీ సౌకర్యాలతోనే ప్రజలకు అందించబోతున్నాం అని వివరించారు. ఉస్మానియా వర్షాల్లో మునిగిపోయినా బీఆర్ఎస్ పట్టించుకోలేదు. కానీ మా సీఎం గోషామహల్‌లో ఆధునిక సౌకర్యాలతో కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాంట్రాక్టు సంస్థ ఇప్పటికే పనులు మొదలుపెట్టిందని చెప్పారు. అలాగే వరంగల్‌లో ఎంజీఎం ఆస్పత్రి నిర్మాణాన్ని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించినట్లు తెలిపారు. త్వరలోనే ఆ ఆస్పత్రిని కూడా ప్రారంభించబోతున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీని మొదలు పెట్టింది కాంగ్రెస్ పార్టీనే. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా కోట్లాది రూపాయలను పేదలకు అందిస్తున్నాం అని గుర్తు చేశారు.

# రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ ప్రక్రియ

మొదటిపేజీ తరువాయి

ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. నల్లగొండ బిడ్డగా.. ఈ గడ్డకు అన్యాయం జరిగితే ఊరుకోనని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి,చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని,జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని కోరారు. దక్షిణ భాగం విషయంలో రైతుల అనవసర ఆందోళన చెందొద్దని మంత్రి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఆర్ అండ్ బి మినిస్టర్ అయిన తాను రైతుల అంగీకారం తోనే ముందుకు పోతామని తేల్చిచెప్పారు. నేను రైతు బిడ్డను..రైతుకు అన్యాయం జరిగితే ఊరుకుంటానా అంటూ త్వరలోనే ముఖ్యమంత్రి తో మాట్లాడి మంత్రుల కమిటీ వేస్తామని తనను కలిసిన రైతులకు హామీ ఇచ్చారు. అయితే ఇటీవల పత్రికల్లో,సోషల్ మీడియాలో రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో అసత్య ప్రచారం చేస్తున్నారని రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు భూసేకరణ, నిర్మాణం కోసం 45వేల కోట్ల వరకు ఖర్చు అవుతుంది. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన,ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల ఓఆర్ఆర్ ను 7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే..అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని, వాళ్ల ట్రాప్ లో పడొద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలే,రేషన్ కార్డు ఇయ్యలే,సన్న బియ్యం ఇయ్యలే,ఇంటికి ఉచిత కరెంట్ ఇయ్యలే కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేసారని ఎద్దేవా చేశారు. నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తని తన పేరు చెప్పి గౌరెల్లి భద్రాచలం హైవే,ఎల్బీనగర్, మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్-విజయవాడ హైవే 8లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభం అవుతాయని మరోమారు స్పష్టం చేశారు.

# ఎర్రగడ్డ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు

మొదటిపేజీ తరువాయి

నగర్, శంకర్‌లాల్ నగర్, ఛత్రపతి శివాజీ నగర్ వద్ద అంతర్గత రోడ్లు వేయడం / నటరాజ్ నగర్, బంజారా నగర్, కమ్యూనిటీ హాల్‌ల పునరుద్ధరణ కు శంకుస్థాపన పనులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ బెగ్ ఖాద్రి ,మీర్జా రియాజ్ హాల్ హసన్ ఎఫండీ, కొసర్ మొహినుద్దీన్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ ,కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ,నవీన్ యాదవ్, అజారుద్దీన్,జోనల్ కమిషనర్ హేమంత్ ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.ఎర్రగడ్డ డివిజన్ లో 2.16 లక్షల రూపాయల తో సీసీ రోడ్లకు / కమ్యూనిటీ శంకుస్థాపన చేశామని మంత్రి పొన్నం చెప్పుకొచ్చారు. 54 లక్షల రూపాయలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేసుకున్నాం. పక్కన ఉన్న స్థలం ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేసుకుంటున్నాం..రేపటి నుండి పనులు ప్రారంభం అవుతాయని.. వాకింగ్ ట్రాక్ ,పిల్లల గేమ్స్ తదితర ఏర్పాటు చేస్తాం..అధికారులకు ఇప్పటికే ఆదేశించామన్నారు. డ్రింకింగ్ వాటర్ ,శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశాం..200 యూనిట్ల ఉచిత విద్యుత్ ,500 కి గ్యాస్ అందిస్తున్నామన్నారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతి తో ఓట్లు అడగాలని చూస్తున్నారు..ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారు. కంటోన్మెంట్ ఎన్నికల మాదిరి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఓటర్లకు సూచించారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి ముఖ్యమంత్రి గారు తీసుకున్నారు.

# పేటబషీరాబాద్ యువతి ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి

దని శుక్రవారం ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఆరు నెలల క్రితమే విద్యార్థిని తండ్రి మరణించాడు. తండ్రి చనిపోయిన తర్వాత 5 స్టార్ ఫైనాన్స్ వాళ్ళు అప్పు చెల్లించాలని పెదనాన్న మీద ఒత్తిడి తీసుకొచ్చారని.. దీంతో పెద్దనాన్న తమను డాక్యుమెంట్ల కోసం వేధిస్తున్నాడంటూ చనిపోయే ముందు మృతురాలు సూసైడ్ నోట్‌లో పేర్కొంది. 'రోజూ మా పరువు పోతుంది, అమ్మ ఒక్కతే ఇన్ని అప్పులు చెల్లించలేదు. అందుకే చనిపోతున్నా' అంటూ సూసైడ్ నోట్ రాసింది. లెటర్‌లో పెద్దనాన్నపై ఆరోపణలు చేయడంతో శ్రీనివాస్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.



## పాలకుర్తి జడ్పీటీసి టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాంచాలి

పెద్దపల్లి (ఆకాంక్ష) : పాలకుర్తి మండల జడ్పీటిసి కాంగ్రెస్ టికెట్ నేతకాని సామాజిక వర్గానికి కేటాయించాలని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కు నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దుర్గం రాజేష్, రాష్ట్ర ముఖ్య సలహాదారు దుర్గం నర్సయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి గోల్లే రాజమల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కామెర ప్రకాష్, రాష్ట్ర నాయకులు దుర్గం నగేష్ శనివారం వినతిపత్రం అందజేశారు. పాలకుర్తి మండలంలో నేతకాని జనాభా అత్యధికంగా ఉందని, మా సామాజిక వర్గానికి చెందిన గోల్లే రాజ్ కుమార్ కు కాంగ్రెస్ జడ్పీటిసి అభ్యర్థిగా టికెట్ ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు నేతకాని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతకాని మండల నాయకులు జాడి తిరుపతి, పాయిడి సత్యనారాయణ, మంచినీళ్ళ లింగయ్య, బౌతు గంగజలం, రావుల శ్రీనివాస్, ముడిమడుగుల చంద్రశేఖర్, ముడిమడుగుల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



## గుండెపోటుతో బీఆర్ఎస్ సీనియర్ నేత మృతి

వేములవాడ,అక్టోబర్ 4(ఆకాంక్ష) : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త, మాజీ గ్రామ అధ్యక్షుడు వేములవాడ శ్రీనివాస్ (47) గుండెపోటుతో మృతిచెందాడు. శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో ఆయనను ఆసుపత్రికి తరలించినా చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయన మరణ వార్తతో నాంపల్లి ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.శ్రీనివాస్ పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన నిబద్ధత కల నేతగా స్థానికంగా గుర్తింపు పొందారు. ఆయన మరణం పట్ల పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మరణవార్త తెలిసిన వెంటనే బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ నర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్థివదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "శ్రీనివాస్ మరణం పార్టీకి తీరనిలోటు. ప్రజా సేవలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమై ఉంటుంది" అని పేర్కొన్నారు.అదే విధంగా చల్మెడ నర్సింహారావు మాట్లాడుతూ, శ్రీనివాస్ కుటుంబ సభ్యులు మనోధైర్యం కోల్పోవద్దని, పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, నాయకులు నీలం శేఖర్, వాసాల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, జోగిని శంకర్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వేములవాడ శ్రీనివాస్ మృతి పట్ల ప్రాంత ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నారు.



## ఎస్ఇసి మెంబర్ గా నియమితులైన కొలకలూరి కోటేశ్వరరావు అభినందిస్తున్న బలసాని

ప్రతిపాడు (ఆకాంక్ష న్యూస్) అక్టోబర్ 5: ఈరోజు మధ్యాహ్నం, ప్రత్తిపాడు నియోజకవర్గానికి "స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్" మెంబర్ గా నియమితులైన "శ్రీ కొలకలూరు కోటేశ్వరావు" , ప్రత్తిపాడు నియోజకవర్గ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి "శ్రీ బలసాని కిరణ్ కుమార్" ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది. ఈ సందర్భంగా బలసాని కిరణ్ కుమార్ గారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి తమ వంతు సహకారాలను అందించి, పార్టీకి అన్ని విధాలుగా అండగా నిలిచి, పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

## జగిత్యాల జిల్లా యువకుడు లండన్‌లో గుండెపోటుతో మృతి



జగిత్యాల, అక్టోబర్ 4 (ఆకాంక్ష): జగిత్యాల జిల్లా వేడిపల్లి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన యువకుడు లండన్‌లో గుండెపోటుతో మృతి చెందడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఏనుగు మహేందర్ రెడ్డి (26) రెండు సంవత్సరాల క్రితం ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లాడు. అక్కడే పీజీ చదువు పూర్తి చేసి ఇటీవలే ఉద్యోగం సాధించాడు. వర్క్ వీసా కూడా మంజూరవడంతో కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. అయితే, ఆ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. అక్టోబర్ 3వ తేదీ శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మహేందర్ రెడ్డి ప్రాణాలు కోల్పోయాడు. ఈ దుర్వార్తను లండన్‌లో ఉన్న మహేందర్ స్నేహితులు ఫోన్ ద్వారా అతని కుటుంబానికి తెలియజేయడంతో దమ్మన్నపేటలో విషాదఘోష మొదలైంది. కొడుకు విదేశాల్లో స్థిరపడతాడని ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు రమేశ్ రెడ్డి, లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కుమారుడు జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్న వేళ ఈ దుర్ఘటన జరగడం దురదృష్టకరమని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మహేందర్ రెడ్డి తండ్రి రమేశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. తమ నాయకుడి కుమారుడి ఆకస్మిక మరణ వార్త తెలిసి కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు దమ్మన్నపేటకు చేరుకుని కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.మహేందర్ మృతి పట్ల ప్రభుత్వ విప్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఆది శ్రీనివాస్ గాఢ సానుభూతి ప్రకటించారు. లండన్ నుంచి మహేందర్ రెడ్డి మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మహేందర్ రెడ్డి ఆకస్మిక మరణం దమ్మన్నపేట గ్రామంలోనే కాకుండా మొత్తం మేడిపల్లి మండలాన్ని దుఃఖంలో ముంచేసింది. చదువులో ప్రతిభావంతుడు, మృదుస్వభావి అయిన మహేందర్ అకాల మరణం తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులను కన్నీరముంచింది.

## ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మె మళ్లీ ప్రారంభం




ఇల్లెందు, అక్టోబర్ 4(ఆకాంక్ష) : ఇల్లెందు పట్టణం, మండల పరిధిలోని బాలికల మరియు బాలుర ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లల్లో పనిచేస్తున్న డైలివేజ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లు తమ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ మళ్లీ సమ్మె బాట పట్టారు. ఇప్పటికే 23 రోజులుగా కొనసాగుతున్న ఈ సమ్మెపై ప్రభుత్వం ఎటువంటి స్పందన చూపకపోవడంతో శనివారం నుండి సమ్మెను తిరిగి ప్రారంభించినట్లు జేఏసీ నాయకులు ప్రకటించారు.ఈసందర్భంగా రొంపెడు బాలికల ఆశ్రమ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబీ, జేఏసీ నాయకులు లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, రామకళా, మంగలు సంయుక్తంగా ప్రారంభించారు.సమ్మె శిబిరంలో నిర్వహించిన సమావేశంలో అబ్దుల్ నబీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్ వేతనాలు చెల్లించకుండా, కొత్త మెనూ పేరుతో అదనపు పనిభారం మోపిందని, కార్మికులతో వెట్టి చాకిరీ చేయిస్తూ ఊడిగం పనులు చేయిస్తున్నదని తీవ్రంగా విమర్శించారు.కార్మికుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన అన్నారు. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం అన్యాయమని, వెంటనే టైమ్ స్కేల్ అమలు చేసి వేతనాలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్వామి, తారబాయ్,నాగేశ్వరరావు,వజ్జ నగేష్, కుమార్ తదితర హాస్టల్ కార్మికులు పాల్గొన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని, తమ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని కార్మికులు స్పష్టం చేశారు.

## ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడు

### – మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న యువతీ



గద్వాల(ఆకాంక్ష) : ప్రేమలో నమ్మకద్రోహం విషాదాంతానికి దారితీసింది. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మబలికిన యువకుడు చివరికి మాట తప్పడంతో యువతి మనస్థాపానికి గురై ప్రాణాల్ని తీసుకుంది. ఈ హృదయ విదారక సంఘటన గట్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నోనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే... ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంక అనే యువతి, చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడితో గత కొన్నేళ్లుగా ప్రేమ సంబంధం కొనసాగిస్తోంది. పెళ్లి చేసుకుంటానని యువకుడు హామీ ఇవ్వడంతో ఆమె అతనిపై విశ్వాసం పెంచుకుంది. అయితే రెండు నెలల క్రితం ప్రియాంక పెళ్లి విషయమై ఆ యువకుడిని సంప్రదించగా, అతడు నిరాకరించాడు. దీంతో బాధతో ఆమె గద్వాల జిల్లా పోలీసులను ఆశ్రయించి చీటింగ్ కేసు నమోదు చేయించగా, ఆ కేసులో ఆ యువకుడు అరెస్టయి జైలుకు వెళ్లాడు.ఇటీవల జైలు నుంచి విడుదలైన ఆ యువకుడిని మళ్లీ కలిసిన ప్రియాంక అతని ఇంట్లోనే ఉండసాగింది. అయితే మరోసారి పెళ్లి ప్రతిపాదనను ఆమె ముందుంచగా, అతడు తిరిగి నిరాకరించాడు. దాంతో ఆత్మవేదనతో ప్రియాంక రెండు రోజుల క్రితం పురుగుమందు తాగింది.తక్షణమే ఆమెను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే శనివారం ఉదయం చికిత్స పూర్తయి తిరిగి గ్రామానికి చేరుకున్న ఆమె పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటనతో చిన్నోనిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ప్రియాంక మరణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి మృతి వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీయడానికి పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు.



## కాన్షీరాం వర్ధంతిని జయప్రదం చేయాలి

### కర పత్రాలు విడుదల చేసిన నాయకులు

పెద్దపల్లి (ఆకాంక్ష) : ఈనెల 9న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఎస్పీ పార్టీ కార్యాలయంలో నిర్వహించే కాన్షీరాం 19 వర్ధంతిని పార్టీ శ్రేణులు, బహుజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ఇంఛార్జి వరికిళ్ళ మల్లేష్, జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం వర్ధంతి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహుజనుల రాజ్యాధికార ప్రదాత, భారత సామాజిక శాస్త్రవేత్త, బడుగుల ఆశాజ్యోతి, బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కలిసి రావాలని కోరారు. బహుజనులను రాజకీయంగా చైతన్యం చేసి అధికారం వైపు నడిపి ఉత్తరప్రదేశ్ లో బీఎస్పీని అధికారంలోకి తెచ్చి అట్టడుగు వర్గాలకు మేలు చేసిన వ్యక్తి కాన్షీరాం అని కొనియాడారు. భారత రాజకీయ యుద్ధభూమిలో ఓట్లు మావి సీట్లుమీవా అనే నినాదంతో మనువాదుల గుండెల్లో వణుకుపుట్టించి బహుజనుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహనీయుడు కాన్షీరాం అని గుర్తు చేశారు. కాన్షీరాం వర్ధంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, బహుజనులందరు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టే రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, మంథని నియోజకవర్గ ఇంచార్జీ జనగామ రవికుమార్, రామగుండం అసెంబ్లీ ఇంఛార్జి జింక ఉదయ్, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి సాతురి అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## కన్నీటిపర్యంతమైన కొత్త జీవితం...

### - ఆరు రోజుల ప్రేమవివాహం
### - యువతి ఆత్మహత్యతో విషాదం



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 4 (ఆకాంక్ష): జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో హృదయ విదారక సంఘటన చోటు చేసుకుంది. ఆరు రోజుల క్రితం ఎంతో ప్రేమతో పెళ్లి చేసుకున్న ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడటం స్థానికులను షాక్‌కు గురిచేసింది. కోరుకున్నోడిని వివాహం చేసుకున్న ఆనందం నిలవకముందే ఇలాంటి విషాదం సంభవించడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు.ఎర్దండి శివారులోని ఒడ్డెర కాలనీలో నివసించే బోదాసు గంగోత్రి (22), అదే కాలనీకి చెందిన అల్లిపు సంతోష్ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దల అనుమతితో గత నెల 26న ఇద్దరూ వివాహం చేసుకున్నారు. పెండ్లి తర్వాత కొత్తజంట ఆనందంగా గడుపుతుందని ఊహించిన కుటుంబసభ్యులు ఇప్పుడు ఈ ఘటనతో తీవ్ర విషాదంలో మునిగిపోయారు.దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 2న గంగోత్రి తన భర్త సంతోష్‌తో కలిసి పుట్టింటికి వచ్చింది. ఆ రోజు కుటుంబ సభ్యులతో భోజనం చేస్తుండగా ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం జరిగినట్లు సమాచారం. పెద్దలు సర్దిచెప్పడంతో సంతోష్ తన భార్యను వెంట తీసుకొని తిరిగి అత్తింటికి వెళ్ళాడు. అయితే, గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత గంగోత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. గంగోత్రి తండ్రి ఫిర్యాదులో "మా కూతురు భర్తతో గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఉంటుందేమో, లేదా అత్తింట్లో ఏదైనా ఇబ్బంది ఎదురై ఉండొచ్చు" అని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.సిఐ అధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొత్తగా పెళ్లయిన యువతి ఇంత తక్కువ సమయంలో ప్రాణాలు తీసుకోవడంతో గ్రామంలో శోకసంద్రం అలుముకుంది. బంధుమిత్రులు ఆమె మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు."కొత్త జీవితం మొదలుపెట్టిన మా అమ్మాయి ఇలా వెళ్లిపోతుందని ఎవరూ ఊహించలేదు" అంటూ తల్లిదండ్రులు విలపించారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల దర్యాప్తుతో గంగోత్రి ఆత్మహత్య వెనుక కారణాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# పాలకుర్తి కాంగ్రెస్‌లో దుమారం

## - కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్‌లోకి వలసల వేగం



వరంగల్,అక్టోబర్ 4 (ఆకాంక్ష) : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై వస్తున్న వ్యతిరేకత, నేతల పట్ల అనుచిత ప్రవర్తన కారణంగా సొంత నాయకులే పార్టీని వీడుతున్నారు. దీంతో పాలకుర్తి ప్రాంతంలో కాంగ్రెస్ బలహీనత రోజురోజుకు స్పష్టమవుతోంది. తాజాగా పాలకుర్తి నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తారహస్తం గులాబీ కండువా కప్పుకున్నారు. ఆమెతో పాటు పలు గ్రామాల స్థాయి కాంగ్రెస్ నేతలు కూడా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వరంగల్ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాల గ్రామానికి చెందిన సుమారు 120 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి, పాలకుర్తి మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో వీరు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి వారిని కండువా కప్పి పార్టీ తరఫున స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి పెట్టడం లేదు. రేవంత్ పాలనలో పార్టీ నాయకులకు గౌరవం లేకుండా పోయింది. అందుకే మేము బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నాం అని తెలిపారు. ఓయూ విద్యార్థి నాయకుడు పృథ్వీ రెడ్డి కూడా ఈ సందర్భంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. యువతకు అవకాశాలు ఇవ్వడంలో, అభివృద్ధి పథకాలను అమలు చేయడంలో బీఆర్ఎస్ పార్టీ ముందు ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్థానిక కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీ రెడ్డి తీరుతో విసిగి, పార్టీని వదిలేశాం. ఆమె కారణంగా పార్టీ లోపల విభేదాలు, అసహనం పెరిగాయి. బీఆర్ఎస్‌లో అయితే ప్రజల కోసం పనిచేసే అవకాశం లభిస్తుందని భావించాం" అని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ %-% "కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అంచనాలను తీర్చడంలో పూర్తిగా విఫలమైందని పాలకుర్తి ప్రజలు రేవంత్ పాలనను తిరస్కరిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌పై ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ బలమైన ప్రత్యామ్నాయం అవుతుంది" అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో జరిగిన అభివృద్ధి, పథకాల అమలు ఈ ప్రాంత ప్రజల మదిలో ఇంకా నిలిచే ఉన్నాయి. మళ్లీ ఆ బాటలోనే పయనించేందుకు కొత్త శక్తులు చేరుతున్నాయని అన్నారు. తాజా చేరికలతో పాలకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలాన్ని మరింతగా పెంచుకుంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో బీఆర్ఎస్ శ్రేణులు మళ్లీ చురుకుదనం ప్రదర్శిస్తున్నాయి. స్థానిక స్థాయిలో కాంగ్రెస్ పార్టీ తాత్కాలికంగా మోరల్ డౌన్ అయినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన ఈ తరుణంలో కాంగ్రెస్ నేతల ఈ వలసలు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మరో ప్రతీకాత్మక దెబ్బగా భావిస్తున్నారు. రాజకీయ వర్గాలు అభిప్రాయ పడుతున్నట్లు, రానున్న రోజుల్లో పాలకుర్తి సహా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇంకా పలువురు నేతలు గులాబీ కండువా కప్పే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ పరిణామాలతో పాలకుర్తి రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది. బీఆర్ఎస్ బలంగా నిలబడగా, కాంగ్రెస్ తాత్కాలికంగా రక్షణాత్మక ధోరణిలోకి జారినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

# పకడ్బందీగా ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉంది

## - పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## - స్థానిక సంస్థల ఎన్నికల పై పత్రిక సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్




పెద్దపల్లి, సెప్టెంబర్-30(ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లాలో స్థానిక సంస్థలు (గ్రామ పంచాయతీలు, ఎంపిటిసి, జడ్పిటిసి) ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎంపీటీసీ జడ్పిటిసి స్థానిక సంస్థలను రెండు విడతలలో మరియు గ్రామ పంచాయతీ ఎన్నికలు రెండు విడతలలో నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేసిందని , అదే ప్రకారం పెద్దపల్లి జిల్లాలో ఎన్నికలు జరుగుతాయని అన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున గ్రామీణ ప్రాంతాల్లో ఎం.సి.సి కోడ్ అమలు కావడం జరుగుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మొత్తం 13 మండలాల్లో 263 గ్రామ పంచాయతీలు,2432 వార్డులు,జిల్లా వ్యాప్తంగా 2432 గ్రామ పంచాయతీ పోలింగ్ స్టేషన్లు, 273 పోలింగ్ లోకేషన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఓటర్ల వివరాల ప్రకారం పురుషులు 198728, మహిళలు 205439, ఇతరులు 14 మంది కలిపి మొత్తం 404181 మందికి ఓటు ఇవ్వడానికి అవకాశం ఉందని, ప్రతి విడతలో మండల వారీగా గ్రూప్ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ కు అనుగుణంగా నామినేషన్, పరిశీలన, పోలింగ్ తేదీలు నిర్ణయించామని అన్నారు. స్థానిక సంస్థ ఎన్నికలకు సరిపడా ఏర్పాట్లు, ఇంచార్జి నియామకాలు, బ్యాలట్ బాక్స్‌లు, పోలింగ్ బూత్‌లు, పార్టీ ప్రతినిధులతో సంప్రదింపులు, షెడ్యూల్ వివరాల అనుసరణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అన్ని పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో పాటు స్థానిక నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నియమాల ప్రకారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సన్నద్ధంగా ఉందని అన్నారు. పోలింగ్ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన వసతులు ఉన్నాయో లేదో చెక్ చేస్తున్నారని, పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా విధులు కేటాయిస్తామని అన్నారు. మండల కేంద్రాలలో నామినేషన్ స్వీకరణ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. నామినేషన్ల స్క్రూటినీ ,ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు ప్రక్రియ పై సిబ్బందికి శిక్షణ అందిస్తామని తెలిపారు. పోలింగ్ రోజు పాటించాల్సిన నిబంధనల, విధుల పై అధికారులకు ముందుగానే సమగ్ర అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పోటీలో ఉండే అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాత బ్యాలెట్ పేపర్ల ముద్రణ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను ముందుగానే సిద్ధం చేసుకుంటున్నట్లు అన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ఒక నోడల్ అధికారి నియమించాలని అన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా రి -పోల్ జరగకుండా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. అనంతరం పాత్రికేయులకు ఉన్న వివిధ సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. ఈ సమావేశములో నరేందర్, సీఈఓ జడ్పీ మరియు వీర బుచ్చయ్య, పాల్గొన్నారు.

# జీఎస్టీ సంస్కరణల వల్ల తగ్గిన ధరల గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా అధికారులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, అక్టోబర్ 4 : సూపర్ జీఎస్టి....సూపర్ సేవింగ్స్ కార్యక్రమం అమలులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో చేనేత, టెక్స్టై టైల్స్, రెడీ మెడ్ ఉత్పత్తులపై ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను శనివారం జిల్లా కలెక్టర్ కలెక్టర్ చదలవాడ నాగరాణి సందర్శించారు. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్లో ప్రదర్శించిన చేనేత వస్త్రాలు, భీమవరానికి చెందిన సీఎంఆర్, రేమాండ్స్, ఇభా స్టోర్స్ వారు ఏర్పాటు చేసిన రెడీమేడ్ దుస్తులు, నరసాపురం లేస్ పార్క్ కి చెందిన లేస్ ఉత్పత్తులను పరిశీలించి జీఎస్టీ తగ్గింపునకు ముందు ప్రస్తుత ధర సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిఎస్టీ తగ్గింపు ద్వారా పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రతి కుటుంబానికి ఆర్థికంగా కొంత ప్రయోజనం ఉంటుందన్నారు. చేనేత వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులుపై జిఎస్టి 12 శాతం నుండి 5 శాతానికి తగ్గింపు ద్వారా పేద మధ్యతరగతి వర్గాలకు సొమ్ము ఆదా అవుతుందన్నారు. చేనేత, రెడీమేడ్, టెక్స్టై టైల్స్ ఉత్పత్తుల ధరల తగ్గుదలపై ప్రజలకు తెలియజేసేందుకు మండల, గ్రామస్థాయిలో కూడా ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేనేత కార్మికుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరు చేనేత దుస్తులు వినియోగించి వారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరికి అవగాహన కలిగేలా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

# ఆటోలో మర్చిపోయిన బ్యాగును బాధితురాలికి అందజేసిన పోలీసులు




వరంగల్ అక్టోబర్ 04(ఆకాంక్ష) : వరంగల్ శివనగర్‌కు చెందిన మహమ్మద్ సహనా బేగం శనివారం జరిగిన సంఘటనలో పోలీసుల చొరవకు కృతజ్ఞతలు తెలిపారు. సమాచారం ప్రకారం, సహనా బేగం తన ఇద్దరు మనవరాళ్లతో కలిసి మహబూబాబాద్ పట్టణానికి వచ్చారు. కురవి గేట్ వద్ద ఆటో ఎక్కి బేతోల్ స్టేజీ వద్ద దిగిన అనంతరం చెల్లెలి ఇంటికి వెళ్లిన ఆమె తన బ్యాగ్ ఆటోలో మరిచిపోయినట్లు గుర్తించారు. ఆందోళనకు గురైన బాధితురాలు వెంటనే కురవి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఘటన వివరాలు తెలియజేశారు. ఆమె ఫిర్యాదును స్వీకరించిన రెండో ఎస్సై జయకుమార్, మహిళా కానిస్టేబుల్ అనిత, కానిస్టేబుల్ రమేష్ వెంటనే స్పందించి సాంకేతిక ఆధారాలతో ఆటో ప్రయాణ దిశను గుర్తించారు. పోలీసులు బాధితురాలిని వెంట తీసుకుని పోలీస్ వాహనంలో మరిపెడ వైపు బయల్దేరి, పురుషోత్తమాయగూడెం సమీపంలో ఆ ఆటోను ఆపి తనిఖీ చేశారు. తనిఖీలో బ్యాగ్ సురక్షితంగా లభించింది. అందులో ఒక తులం బంగారం, రెండు స్మార్ట్‌ఫోన్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. తన వస్తువులు సురక్షితంగా తిరిగి లభించడంతో మహమ్మద్ సహనా బేగం ఆనందభాష్పాలు పెట్టి, పోలీస్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "ఇలాంటి సత్వర స్పందనతో ప్రజల్లో పోలీసులపై నమ్మకం మరింత పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# వనపర్తి జిల్లా కొత్తకోటలో 101 వంటకాల విందుతో అల్లుడికి అత్త సర్ప్రైజ్...

## - 101 వంటకాలను తిని తులం బంగారం గెలుచుకున్న అల్లుడు....



వనపర్తి జిల్లా(ఆకాంక్ష) : దసరా పండుగ సందడి మధ్య ఓ కొత్త అల్లుడు, అత్తమామల ఇంట్లో జరిగిన వినూత్న సంఘటన ఇప్పుడు చర్చనీయాంశమైంది. పండుగ ఆనందంలో భాగంగా అత్తమామలు 101 రకాల వంటకాలతో అల్లుడి కోసం విందు ఏర్పాటు చేయగా, ఒక వంటకం తగ్గిందని నిరూపించి అల్లుడు తులం బంగారం బహుమతిగా గెలుచుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే కొత్తకోట పట్టణానికి చెందిన గుంట సురేశ్, సహనా దంపతులు తమ కుమార్తె సింధును రెండు నెలల క్రితం వరంగల్‌కు చెందిన నికిత్ అనే యువకుడికి వివాహం చేశారు. పెళ్లి అనంతరం వచ్చిన ఇది మొదటి పెద్ద పండుగ కావడంతో దంపతులు అల్లుడు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సంప్రదాయంగా కొత్త అల్లుడికి ఘనంగా స్వాగతం పలికి, విందు వడ్డించారు. దసరా రోజున అత్తమామలు అల్లుడిని సంతోషపరచేందుకు 101 రకాల రుచికరమైన వంటకాలతో భోజన విందు ఏర్పాటు చేశారు. వేపుడు, కూరలు, పచ్చళ్లు, చట్నీలు, పప్పులు, స్నాక్స్, స్వీట్స్‌మొత్తంగా భోజన పందిరి రంగురంగుల వంటకాలతో కళకళలాడింది. వంటకాలు వడ్డించే ముందు అత్త సహనా సరదాగా మాట్లాడుతూ..మా అల్లుడి కోసం 101 రకాల వంటలు చేశాం" అని గర్వంగా చెప్పడంతో, నికిత్ కాస్త చిలిపిగా స్పందించాడు. అవును అత్తగారూ, నిజంగానే 101 వంటకాలు చేశారో లేదో నేను లెక్కేస్తా. ఒకటి తగ్గితే ఏం ఇస్తారు?" అని సరదాగా అడిగాడు. అత్తమామలు కూడా ఆటలో పాల్గొని "ఒక వంటకం తగ్గిందని నిరూపిస్తే తులం బంగారం ఇస్తాం" అని నవ్వుతూ అన్నారు. ఆ తర్వాత అల్లుడు ఒక్కొక్క వంటకం లెక్కపెట్టాడు. చివరికి మొత్తం 100 రకాల వంటకాలు మాత్రమే ఉన్నాయని నిరూపించాడు. అత్తమామలు కూడా లెక్క వేసి చూసి నిజమే అని గుర్తించారు. మాట నిలబెట్టుకుంటూ అత్త నికిత్‌కు తులం బంగారం బహుమతిగా అందజేశారు. ఈ సంఘటనతో ఇరువైపుల కుటుంబాలు నవ్వుల్లో మునిగిపోయాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, పొరుగు వారు ఈ హాస్యభరిత సంఘటనను ఆస్వాదించారు. సోషల్ మీడియాలో ఈ ఘటన ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. దసరా పండుగ సందర్భంగా కుటుంబం అంతా ఒకచోట చేరి నవ్వులు పంచుకోవడం, సరదాగా ఆడుకోవడం ఎంత ఆనందదాయకమో కొత్తకోట కుటుంబం చూపించింది. అత్త, అల్లుడు మధ్య స్నేహభావం, సరదా ప్రేమల మిశ్రమం ఈ సంఘటనలో ప్రతిబింబించింది. దసరా రోజున కొత్తకోటలో జరిగిన ఈ సంఘటన, సాంప్రదాయ పండుగలతో పాటు మనుషుల మధ్య ఉన్న ఆప్యాయతకు చక్కటి ఉదాహరణగా నిలిచింది.

# నిరాశ్రయులకు భోజన సౌకర్యం కల్పించటం అభినందనీయమం

## - బిజెపి పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ



గుడివాడ, : ఆకునూరి వెంకట్రావు వర్ధంతి సందర్భంగా నిరాశ్రయుల ఆశ్రమంలో వున్న వృద్ధులకు భోజనం అందజేయడం అభినందనీయమని బిజెపి పట్టణాధ్యక్షుడు మాచర్ల రామ కృష్ణ(ఆర్కె) అన్నారు. శనివారం స్థానిక మందపాడులోని నిరాశ్రయుల ఆశ్రమంలో ఆకునూరి వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు భోజనం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ,ఆర్కె మాట్లాడుతూ అన్నదానం పరబ్రహ్మ స్వరూపం అనే నినాదంతో ఆకునూరి వెంకట్రావు వర్ధంతి సందర్భంగా అయన కుటుంబ సభ్యులు ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు, పేదవారికి ఆహారం అందజేయడం జరిగిందన్నారు. చాలామంది ఇలాంటి కార్యక్రమాలు బంధుమిత్రులతో ఎంతో ఖర్చు వెచ్చించి కార్యక్రమాలు చేస్తూ ఉంటారు. కానీ ఆకునూరి కుటుంబ సభ్యులు వారి తండ్రి వర్ధంతి సందర్భంగా పేదవారికి, ఆకలితో ఉన్న అన్నార్తులకు ఆహారం అందజేయడం చాలా మంచి కార్యక్రమన్నారు. దయచేసి గుడివాడ పట్టణ ప్రజలు మీ పెళ్లి రోజు, పుట్టిన రోజు వివిధ శుభ కార్యక్రమాలకు మీ పేరు మీద ఆకలితో ఉన్న అన్నార్తులకు ఆహారం అందజేయాలని కోరారు.



# స్థానిక సంస్థల ఎలక్షన్ల ముందు కాంగ్రెస్ పార్టీకి షాక్

**- పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రాజీనామా**

**- మాజీ మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిక**

**- అదే బాటలో మరి కొంతమంది నేతలు**

జనగామ జిల్లా /పాలకుర్తి అక్టోబర్, 4(ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి నియోజకవర్గం పరిధిలో జరగబోవు స్థానిక సంస్థల ఎలక్షన్ల ముందు కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. పాలకుర్తి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు శ్రీ వడ్లకొండ తార గారు తన పదవి కి రాజీనామా చేశారు. ఆత్మగౌరవం లేనిచోట ఉండలేనని కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ తన రాజీనామాను ప్రకటించారు. అదేవిధంగా దేవరుప్పుల మండలం నిర్మల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ క్రియాశీల నేతలు తిరుపల్లి కొండల్ రెడ్డి ,ఎడ్ల శ్రీను సహా మరికొందరు రాజీనామా చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గారి సమక్షంలో వీరందరూ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు పల్ల సుందర్ రామిరెడ్డి, బబ్బురి శ్రీకాంత్ గౌడ్ గారు , మండల పార్టీ అధ్యక్షులు తీగల దయాకర్, చింత రవి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై రవీందర్ సస్పెండ్

ఓ కేసు విచారణలో లంచం డిమాండ్ చేసి వేధించిన ఎస్సై రవీందర్. ఎస్సై వేధింపులతో మంజీరా నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న లోకేష్. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన మృతుడి భార్య మల్టిజోన్-II ఐజీ ఆదేశాలతో విచారణ జరిపి..శాఖాపరమైన చర్యలు తీసుకున్న ఎస్పీ పరితోష్ పంకజ్



# రిజర్వేషన్ కల్పించండి సారూ...

జనగాం జిల్లా :-రఘునాథపల్లి మండలం కోడూరు గ్రామం.అక్టోబర్ 0 4 (ఆకాంక్ష న్యూస్): ప్రతినిధి జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కోడూరు గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ రాకపోవడంతో స్థానిక పోరులో ముందజంలో ఉందామనుకున్నా ఎస్సీలకు సర్పంచ్, వార్డ్ మెంబర్ ఆశావాహులకు రిజర్వేషన్ లు షాక్ కి గురిచేశాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం 480 ఓట్లు ఎస్సీ కులస్తులు ఉండగా ఇందులోని 400 ఓట్లు కొందరి తప్పిదం వల్ల బీసీ కులంలో చూపించడంతో కోడూరు గ్రామ ఎస్సీలకు దాదాపు 40 సంవత్సరాలుగా రిజర్వేషన్ కలిసి రావడంలేదు ఇందుకు గాను కోడూరు గ్రామ ప్రజలు పార్టీ లకు, కులాలకు అతీతంగా ఎమ్మార్వో , ఎంపీడీవో అధికారులను కలిసి చట్ట పరమైన సవరణలు చేసి ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొయ్యడ మల్లేశం గ్రామ పెద్దలు శాగంటి సోమయ్య ,బండ దేవదానం , శాగంటి పెద్ద సోమయ్య ,కట్కూరియాదగిరి ,జీడి సోమయ్య ,బండ కృష్ణ , శాగంటి అంజయ్య , శాగంటి సోమయ్య ,చింత ఏలియా ,గుండె స్వామి ,బండ సోమయ్య, జోగు గట్టయ్య, పూజారి మదన్మోహన్, గిరిగే భాస్కర్, సానిక చంద్రయ్య, సట్ల యాకమ్మ మరియు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# దీపావళి పండుగ సందర్భంగా నరకాసుర వధ ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరిన నరకాసుర ఉత్సవకమిటి





వరంగల్,సెప్టెంబర్ 04 (ఆకాంక్ష న్యూస్): దీపావళి పండగ సందర్భంగా నరకాసుర ఉత్సవాలకు వరంగల్ మహా నగర పాలక సంస్థ తగిన ఏర్పాట్లు చేయాలని కోరిన నరకాసుర వధ ఉత్సవ కమిటి. ఈనెల 19వ తారీఖున దీపావళి పండుగ సందర్భంగా జరుగు నరకాసుర వద ఉత్సవాలకు మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయిస్తామని వరంగల్ మహానగర పాలక సంస్థ మేయర్ గుండు సుధారాణి ,కమీషనర్ చాహత్ బాజ్పాయ్ గార్లు తెలిపినారు. శనివారం రోజున నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో మేయర్ గుండు సుధారాణి కమిషనర్ చాహత్ బాజ్పాయ్ గార్లకు బొకే ఇచ్చి వినతిపత్రం ఇవ్వనైనది ,భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించాలన్న సత్సంకల్పంతో గత 23 సంవత్సరాల నుండి వరంగల్ కుడా ప్రాంగణంలో 58 అడుగుల భారీ నరకాసుర విగ్రహాన్ని దహనం చేసే కార్యక్రమాన్నీ ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి నిర్వహిస్తున్నామని అట్టి ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆనందపరచుటకు పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణ ఆధునిక సౌండ్ సిస్టం ఏర్పాటుతో పాటు ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధ్యక్షులు మరుపల్ల రవి గారు విన్నవించగా మేయర్ గుండు సుధారాణి ,కమీషనర్ చాహత్ బాజ్పాయ్ గార్లు మాట్లాడుతూ నరకాసురవద ఉత్సవములు అత్యంత వైభవంగా జరపడానికి తాము చొరవ చూపుతామన్నారు .శనివారం రోజున వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద గారికి కూడా వినతిపత్రం ఇవ్వనైనది వినతి పత్రం ఇచ్చిన వారిలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్ నరకాసుర వద ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవి ,కోశాధికారి మరుపల్ల గౌతమ్ ఉపాధ్యక్షులు ఆవునూరి రామ్మూర్తి దూడే బాల కొమురెల్లి సహాయ కార్యదర్శులు వనం కుమార్ అవునూరి రామన్న శెట్టి మోహన్ ఉప కోశాధికారి కోరె సాంబమూర్తి కార్యనిర్వహక కార్యదర్శి తవటం నరసింహ ఆర్గనైజర్లు మాటేటిశ్యామ్ కుండె రాజు ఆవు నూరి ఐలేశం కొమ్ము రాజు కాటం సతీష్ లు ఉన్నారు.

# పంటల సమగ్ర సస్యరక్షణ పై అవగాహన సదస్సు



జనగామ జిల్లా /పాలకుర్తి అక్టోబర్, 4 (ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి మండల కేంద్రంలో కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్తి, ఇతర ఖరీఫ్ పంటలలో సమగ్ర సస్యరక్షణ పైన 2 రోజుల హెచ్ ఆర్ డి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సిఐపిఎంసి ,హైదరాబాద్ ఇన్చార్జి సునీత ఆధ్వర్యంలో జరిగింది. రైతులు 60 మంది వరకు పాల్గొన్నారు. ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సునీత మాట్లాడుతూ %జఖ్రావీజ%, రైతుల కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించి, సమగ్ర సస్యరక్షణ పై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో పంట మార్పిడి, ఎర పంటలు, మిత్ర పురుగుల గురించి, విత్తన శుద్ధి ఉపయోగాలు గురించి చెప్పారు. ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణకు పాటించవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలను ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకట రెడ్డి వివరించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్ మాట్లాడుతూ మిత్ర పురుగులు, శత్రు పురుగుల గురించి, ఎన్ పి ఎస్ ఎస్ అనే మొబైల్ యాప్ సస్యరక్షణలో ఏ విధంగా వాడాలో వివరించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ బసవన్నప్ప మాట్లాడుతూ పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి చెప్పారు. సహాయ వ్యవసాయ సంచాలకులు పరశురాం మాట్లాడుతూ రైతులు ఐపిఎం పద్ధతులు తప్పని సరిగా పాటించాలని చెప్పారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా వ్యవసాయ క్షేత్రంలో లింగకర్షక బుట్టలు పెట్టి వాటి వాడకాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శరత్ చంద్ర, వ్యవసాయ విస్తరణ అధికారి రాధిక పాల్గొని రైతులకు మార్గదర్శకం చేసారు.

# కారు ఢీకొని మహిళ మృతి





వరంగల్ : వర్ధన్నపేట మండలం అక్టోబర్ 04(ఆకాంక్ష న్యూస్) : ఉప్పరపెల్లి క్రాస్ రోడ్ వద్ద రెండు కార్లు డీ కొట్టి మహిళలకు తాకడం తో మహిళ అక్కడిక్కడే మృతి. ఉప్పరపల్లి గ్రామానికి చెందిన మైభగా గుర్తింపు... సంఘటన స్థలానికి చేరుకున్న వర్ధన్నపేట ఎస్.ఐ రాజు మహిళ కొన ఊపిరి తో ఉందని గుర్తించి స్థానికులతో కలిసి సీపీఆర్ చేసి బ్రతికించే ప్రయత్నం చేసినా ప్రయత్నం వృధా...కారు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు...



# మృతి చెందిన పాల కేంద్రం ఖాతాదారుని కుటుంబానికి ఆర్థిక సహాయం


**- ఆర్థిక సహాయం అందించిన పులి రాజశేఖర్**

సంగెం మండలం, అక్టోబర్04,(ఆకాంక్ష న్యూస్): కుంటపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కర్దూరి సంజీవ కుటుంబానికి నేనున్నానంటూ సంగెం పాలకేంద్రం సేకరణ పులి రాజశేఖర్ పాల ఖాతాదారులు అందరూ కలిసి తమ వంతు ఆర్థిక సహాయం వారి కుమారులు రాకేష్, వెంకటేష్,లకు 5,000/రూ నగదు రూపంలోఅందజేశారు. పాలకేంద్రం ఖాతాదారుని కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని పులి రాజశేఖర్ భరోసా అందించారు. ఈ కార్యక్రమంలో పాల కేంద్రం రైతులు గోలి అశోక్, సింగం రాజు, యార,శ్రీకాంత్, ఎరుకల శంకర లింగం, పెంతల శ్రవణ్, పెల్లి శంకర్, మరియు ఆ గ్రామ నాయకులు యార బాలకృష్ణ, జున్న రాజు యాదవ్, హరీష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేద్దాం

జనగాం జిల్లా /పాలకుర్తి అక్టోబర్, 4 (ఆకాంక్ష న్యూస్) : పాలకుర్తి మండలం వావిలాల, కొండాపురం %వీుజ% ఏరియా పరిధిలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు పిలుపు నిచ్చారు .గ్రామ పార్టీ అధ్యక్షులు కోల వేణు ప్రభాకర్ మంగ అంజయ్య , బాలాజీ,వెంకన్న ల అధ్యక్షతన సన్నాహక సమావేశ నిర్వహణలో నాయకులు మాట్లాడుతూ.... స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం కలిసిగట్టుగా పనిచేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పనులను ప్రజల్లోకి విస్తృతంగ ప్రచారం చేయాలన్నారు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులే నేడు కనిపిస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో మండల క్లస్టర్ ఆయా గ్రామాల ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల నాయకుల గిరగాని కుమారస్వామి గౌడ్ మండల పార్టీ అధ్యక్షుడు మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ గారు చిట్యాల ఐలమ్మ మార్కెట్ చైర్మన్ లావుడియా మంజుల భాస్కర్, మరియు ఎర్రబెల్లి రాఘవరావు మాజీ మార్కెట్ చైర్మన్ గంగు కృష్ణమూర్తి అయ్యగారు %జుఇ జూఎఎ% కార్యదర్శి మరియు గడ్డం యాక సోమయ్య %జుఇ.వీుా%, మరియు కరూపోతుల శ్రీనివాస్ గౌడ్%జుఇ.వీుా% , మరియు పాలకుర్తి మండల పార్టీ సమన్వయకర్త ఇట్టే శ్యామ్ సుందర్ రెడ్డి, సిలువేరు కృష్ణమూర్తి గారు %జుఇ%గుట్ట చైర్మన్, మరియు వీరమనేని ఏకాంతరావు ఎక్స్ సర్పంచ్, పులి గణేష్ గౌడ్ కొండాపురం ఎంపిటిసి క్లస్టర్ ఇంచార్జ్, లావుడియా భాస్కర్ ఎస్టీ సేల్ మండల అధ్యక్షులు, %వీ.ఐ%. మదర్ జెడ్పి కోఆప్షన్ నెంబర్, జలగం కుమార్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు,లి గూగులోతు కిషన్ నాయక్ పెద్ద తండా %ఎ% కోఆర్డినేటర్, హరిలాల్ నాయక్ మేకల తండా కోఆర్డినేటర్, ఇంకా మూడు గ్రామాల ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.



ఇల్లంద గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం లో దొంగల బీభత్సం. ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి రెండు హుండీలలో ఉన్న నగదు అపహరణ.పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ.

**వరంగల్: వర్ధన్నపేట మండలం అక్టోబర్ 04**(ఆకాంక్ష న్యూస్):




# సంగారెడ్డి జిల్లాలో పోలీసు సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు

## బకాయిల చెల్లింపుల ఆలస్యం

ప్రభుత్వం నుంచి రావాల్సిన టీఏ బిల్లులు మరియు సరెండర్ లీవ్ బకాయిలు చాలా కాలంగా విడుదల కాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పోలీసులు. సంగారెడ్డి జిల్లాలో పోలీస్ విభాగానికి సంబంధించి రూ. 11.34 కోట్లు టీఏ బిల్లులు, రూ. 24 కోట్లు సరెండర్ లీవ్ అమౌంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా, ఒక్కొక్క పోలీస్ సిబ్బందికి సగటున రూ. 94,500 చొప్పున బకాయిలు రావాల్సి ఉందని తెలిపిన అధికారులు. ఇక ఇంధన భత్యాలు, యూనిఫామ్ అలవెన్సులు, హౌస్ రెంట్ అలోవెన్స్‌ల చెల్లింపులు కూడా ఆలస్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్న పోలీసులు ఈ విషయమై పోలీసులు పలుమార్లు పై అధికారులకు, జిల్లా కార్యాలయానికి వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని.. పండగల వేళ కూడా ఈ బకాయిల చెల్లింపులు జరగకపోవడంతో కుటుంబ ఖర్చులు భరించడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెబుతున్న పోలీసులు.



# నిమజ్జనానికి బయలుదేరిన దుర్గామాత


జనగామ టౌన్:అక్టోబర్:04 (ఆకాంక్ష న్యూస్) : జనగామ టౌన్ 5వ వార్డు స్థానిక బాణాపురం నందు 11 రోజులు ఎంతో నిష్టతో పూజలు అందుకున్న దుర్గామాత అమ్మవారుఇందిరమ్మ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో ఆడపడుచులు అక్కా చెల్లెలు అన్నదమ్ములు భక్తిశ్రద్ధలతో ఆటపాటలతో డబ్బు చప్పులతో 11 రోజులు ఎంతో నిష్టతో పూజ చేసిన అమ్మవారిని గంగమ్మ ఒడిలోకి సాగనంపుతున్న అపురూపమైన ఘట్టం




# యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యం లో 418వ రోజు అన్నదాన కార్యక్రమం

వరంగల్/హన్మకొండ,సెప్టెంబర్ 4(ఆకాంక్ష న్యూస్): యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాకు చెందిన వంచనగిరి శివ మేఘన పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులు వంచనగిరి రాజు – సరిత మరియు సోదరుడు వంచనగిరి శివ వర్షిత్ ల సహకారంతో స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమం ములుగు రోడ్డు, హనుమకొండలో ఉన్న వృద్ధులకు 418వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంచనగిరి రాజు, వంచనగిరి సరిత, వంచనగిరి శివ వర్షిత్ వంచనగిరి శివ మేఘన , యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్ , వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు ( స్విమ్మర్ రాజు ) , కానిస్టేబుల్ బొట్టు కమలాకర్ , కోలా రాజేష్ , ప్రభుత్వ ఉ పాధ్యాయుడు గజ్జెల సుమన్ , అలువల పృథ్వి , ఉప్పరపల్లి రాజ్ కుమార్ , మునిగాల రాంప్రసాద్ , సృజన , జ్యోతి , భావన , బిటుకూరి యాకయ్య , పాలకుర్తి విష్ణు , ఎస్.కె ముస్తఫా , లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ ( హైకోర్ట్ అడ్వకేట్ ) , ఊరటి రవికుమార్ , యాద రవికుమార్ , చెలిమల్ల అశోక్ కుమార్ , తూనం రాము , సి.ఐ.ఎస్.ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్ , మోడెం రాజశేఖర్ గౌడ్ , నాగవెల్లి కార్తిక్ గార్లు పాల్గొనడం జరిగింది.

# ఆముదాలవలసలో ఆటో డ్రైవర్ల సేవ : ఎమ్మెల్యే కూన రవి











ఆముదలవలస, (ఆకాంక్ష న్యూస్): ఆముదాలవలస పట్టణంలో ఆటో డ్రైవర్ల సేవలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడురు ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఆముదాలవలస ఎమ్మెల్యే మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవి కుమార్ పాల్గొని డ్రైవర్లతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు ప్రజలతో నిత్యం సంబంధం కలిగి సేవ చేసే వృత్తిజీవులు అని, సమాజంలో వారు ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. వారి కష్టసుఖాల్లో ప్రభుత్వం తోడుగా ఉంటుందని, ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. డ్రైవర్ల కుటుంబాల భద్రత, ఆర్థిక స్థిరత్వం కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే కూన రవి కుమార్ గారు అన్నారు. ఆటో డ్రైవర్ల జీవిత ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆటో యూనియన్ నాయకులు, పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొని ఉత్సాహంగా స్పందించారు. ఎమ్మెల్యేను ఆటో డ్రైవర్లు ఘనంగా స్వాగతించారు.

# సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**- ఈనెల 4వ తేదీన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమం ప్రతీ నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలి**

**- ఈనెల 6వ తేదీన స్వచ్ఛంద్ర అవార్డుల కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి**

**- అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**




ఏలూరు, అక్టోబర్ 4 : సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రెండవ వారం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహణాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు వినియోగించే నిత్యావసర సరుకులపై ఏ మేరకు జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ధి కలుగుతుందో ప్రతీ కుటుంబానికి తెలియజేయాలన్నారు. ఇందుకోసం ప్రచురించిన కరపత్రాలను గ్రామ/వార్డ్ సచివాలయ స్థాయిలో ప్రతీ కుటుంబానికి అందించి, జీఎస్టీ 2.%వా% కింద ఏ వస్తువుపై ఏ మేరకు తగ్గింపు వర్తిస్తుందో తెలియజేసి, వారు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై జిల్లాలో నాలుగు వారాల పాటు ప్రతీ వారం ఒక థీమ్ తీసుకుని ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతున్నదని, మొదటివారం ఇంట్లో వినియోగించే నిత్యావసర వస్తువులు ధరల పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రెండవ వారంలో నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని, రెండవ వారంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలపై జీఎస్టీ సంస్కరణలపై ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో మండల, నియోజకవర్గ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యక షాపింగ్ మేళాలు నిర్వహించేలా ఎంపిడిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 4వ తేదీన ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి ఈనెల 4వ తేదీన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రారంభించనున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి కనీసం 500 మంది లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలనీ, ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈనెల 6వ తేదీన 'స్వచంద్ర అవార్డు' ల కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి స్వర్ణాంధ్ర.. స్వచంద్ర కార్యక్రమంలో జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు, జిల్లా స్థాయిలో 51 అవార్డులు లభించాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే అవార్డుల ప్రధానం కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు, జిల్లా మంత్రివర్యులు, పలువురు ప్రజాప్రనిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున కార్యక్రమం నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ నాగార్జునరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# నకిలీ పోలీసు అరెస్టు

జనగాం జిల్లా,సెప్టెంబర్4 (ఆకాంక్ష న్యూస్): జనగామ పోలీస్ వాహనంపై గతంలో డ్రైవర్ గా పనిచేసి మానేసిన కిరణ్ అనే వ్యక్తి, కానిస్టేబుల్ కుమారస్వామి ఐడి కార్డును దొంగిలించి, తాను పోలీసునని చెప్పుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



# అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జన వేడుకలు




వరంగల్ జిల్లా/వరదన్నపేట మండలం అక్టోబర్ 4 (ఆకాంక్ష న్యూస్): వర్ధన్నపేట మండలంలోని కొత్తపెల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవస్థానం నందు చైర్మన్ కమ్మ గోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో దుర్గామాత ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా ఈరోజు అమ్మవారి నిమజ్జనం సందర్భంగా డప్పు చప్పులతో ఆడపడుచుల కోలాటాలతో యువత డ్యాన్సులతో పాటలు పాడుతూ అమ్మవారిని భక్తితో నిష్టంగా పూజలు చేస్తూ గంగమ్మ సన్నిధికి సాగనంపడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు యువత పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది




# సేవ చాలా గొప్పది..

## - ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలి

శ్రీకాకుళం, (ఆకాంక్ష న్యూస్):సేవ చాలా గొప్పది ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల్లో కొనసాగా లని జిల్లా రెవిన్యూ అధికారి ఎమ్. వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం పట్టణంలో గల ఎన్. జి. ఒ భవన్ లో సాహుకారి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికుల సన్మానం కార్యక్రమం లో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ భవిష్యత్ లో ట్రస్ట్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన్ రావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు లను సత్కారం వారి విలువలును కాపాడుతుందని కొనియాడారు. ఈకార్యక్రమానికి సభా అధ్యక్షులు గా పొలుమహంతి ఉమామహేశ్వసారారావు, సాహుకారి అన్నపూర్ణమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ సాహుకారి నాగేశ్వరావు, లైన్స్ క్లబ్ నటుకుల మోహనరావు,శ్రీనివాస పట్నాయక్, పి. పద్మ, శ్రీదేవి, ఎన్. జి. ఒ నాయకులు హనుమంతు సాయిరాం,రిమ్స్ అడ్మినిస్ట్రేషన్ అధికారి పొలుమహంతి వెంకట సాయి మనోజ్, ఏ ఐ టి యు సి గౌరవ అధ్యక్షులు టి. తిరుపతి రావు, ఎమ్. వి. మల్లేశ్వరరావు, జి. వి. నాగభూషణరావులు పాల్గొన్నారు. ప్రముఖులు చేతులమీదుగా పారిశు ధ్య కార్మికులు ను చీరలు తో సత్కరించారు.

# ఆరోగ్యం

## ఈ 3 డ్రింక్స్ తాగితే క్యాన్సర్ జన్మలో రాదట! హార్వర్డ్ డాక్టర్ చెప్పిన కీలక విషయం



క్యాన్సర్..ఈ పేరు వింటే చాలామంది గుండెల్లో వణకుపుడుతుంది. ఒకప్పుడు క్యాన్సర్ ని ధనవంతుల రోగంగా పరిగణించేవాళ్లు.. అయితే ఇప్పుడు మారిన ప్రజల జీవనశైలి,ఆహార అలవాట్లు కారణంగా అందరినీ టెన్షన్ పెడుతుంది. క్యాన్సర్ లో రకరకాలు ఉన్నాయి. కొన్ని రకాల క్యాన్సర్లు అయితే చివరి స్టేజ్ దాకా బయటపడవు. కనీసం దాని లక్షణాలు కూడా కనబడుతుంది. తీరా క్యాన్సర్ వచ్చింది అని తెలుసుకునే సరికి ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం మనదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. అయితే మనం క్యాన్సర్ బారిన పడకూడదంటే వెంటనే మన జీవనశైలి,ఆహార అలవాట్లను మార్చుకోవడం తప్పనిసరి. రుచిగా ఉందని ఏది పడితే అది తినడం, ఏది పడితే అది తాగడం వంటి అలవాట్లను వెంటనే మార్చుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు. అయితే భవిష్యత్తులో మీరు క్యాన్సర్ బారిన పడకూడదు అంటే మీ ఆహారంలో కొన్ని మార్పులు తప్పనిసరిగా చేయాల్సిందే. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ ఫుడ్స్ తినడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్యాన్సర్ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించే 3 రకాల డ్రింక్స్ గురించి హార్వర్డ్ ట్రైన్డ్, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో ఓ వీడియో ద్వారా సూచించారు. డాక్టర్ సేథీ చెప్పిన ఆ 3 యాంటీ క్యాన్సర్ డ్రింక్స్ ఏవో ఇక్కడ చూడండి. యాంటీ క్యాన్సర్ డ్రింక్స్ ఇవే గ్రీన్ టీ డాక్టర్ సేథీ ప్రకారం.. గ్రీన్ టీ తరచుగా తాగడం వల్ల క్యాన్సర్ ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. గ్రీన్ టీలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇందులో క్యాన్సర్ తో పోరాడటానికి సాయపడే కాటెచిన్ మాచా అనే ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి కాబట్టి ప్రతి రోజూ గ్రీన్ టీ తీసుకోవడం వల్ల క్యాన్సర్ ప్రమాదానికి చెక్ పెట్టవచ్చు. గ్రీన్ స్మూతీ భవిష్యత్తులో క్యాన్సర్ రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ ఆకుపచ్చ కూరగాయలతో చేసిన స్మూతీలను తాగాలని డాక్టర్ సేథీ చెబుతున్నారు. ఇందుకోసం పాలకూర, దోసకాయ, కాలే ఆకుకూర,అల్లం,వాము అన్నీ కలిపి గ్రైండ్ చేసుకొని తాగడం వల్ల శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ లభిస్తాయి. ఈ గ్రీన్ స్మూతీ యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలతో నిండి ఉంటుంది. దీనిని రోజూ తాగడం వల్ల క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుందని డాక్టర్ సేథీ చెప్పారు. పసుపు పాలు మన వంటగదుల్లో తప్పనిసరిగా ఉండే పదార్థాం పసుపు. ఈ పసుపు మన ఆరోగ్యానికి చేసే మేలు అంతా ఇంతా కాదు. క్యాన్సర్ ప్రమాదాన్ని ఇది చాలావరకు తగ్గించగల పవర్ ఫుల్ పదార్థాం పసుపు. పసుపులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలున్నాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని నివారించడంలో సాయపడుతుంది. పసుపులో ఉండే కుర్కుమిన్ అనే సమ్మేళనం శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. డాక్టర్ సేథీ సూచించిన ప్రకారం పసుపు పాలను ఎలా తయారుచేయాలంటే..ఒక గ్లాసు బాదంపాలలో పసుపు,నల్ల మిరియాల పొడిని కలిపి తాగవచ్చు.

## ఎముకలకు పుష్టి,ఎన్నో అనారోగ్యాలకు సంజీవని 'గోంద్ లడ్డు'..ఎలా చేసుకోవాలంటే






మనదేశంలో ముఖ్యంగా నార్త్ ఇండియాలో అత్యంత ప్రజాదరణ పొందిన, పోషకమైన వంటకాల్లో గోంద్ లడ్డు ఒకటి.సాధారణంగా దీన్ని చలికాలంలో ఎక్కువగా తయారుచేస్తుంటారు. మిగతాకాలాల్లో కూడా దీన్ని తయారుచేస్తుంటారు. ఇది కేవలం రుచికరమైన తీపి వంటకం మాత్రమే కాదు, మన ఆరోగ్యానికి ఎన్నో రకాలుగా మేలు చేసే ఒక బలవర్ధకమైన ఆహారం. సంప్రదాయబద్ధంగా ప్రసవం తర్వాత స్త్రీలకు, అలాగే చలికాలంలో శరీరానికి వెచ్చదనాన్ని, రోగ నిరోధక శక్తిని పెంచడానికి,ఎముకలకు పుష్టినిచ్చే ఈ లడ్డూలను తయారుచేస్తారు. గోంద్ లడ్డు తయారీకి సాధారణంగా ఇంట్లో లభించే, సులభంగా దొరికే పదార్థాలు అవసరం అవుతాయి. ఈ పదార్థాలన్నీ పోషకాలతో నిండి ఉంటాయి. గోంద్ లడ్డూని మీ ఇంట్లోనే సలుభంగా తయారుచేసుకోడానికి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

గోంద్ లడ్డు తయారీకి కావాల్సిన పదార్థాలు -గోంద్ -బాదంపప్పు -జీడిపప్పు -ఖర్బూజ గింజలు -నెయ్యి -గసగసాలు -ఎండుకొబ్బరి తురుము -గోధుమ పిండి -బెల్లం.

గోంద్ లడ్డు తయారీ విధానం -ముందుగా పావు కప్పు బాదంపప్పు,పావుకప్పు జీడిపప్పులను చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. మొత్తం కలిపి అరకప్పు ఉండాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 1 కప్పు ఎండుకొబ్బరి తురుము వేసి మీడియం మంట మీద 2-3 నిమిషాలు వేయించి ఓ ప్లేట్ లోకి తీసి పక్కనపెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద ఉన్న బాండీలోనే 2 టేబుల్ స్పూన్ల గసగసాలు వేసి చిట్లనివ్వాలి. ఆ తర్వాత వీటిని ఓ ప్లేట్ లోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద ఉన్న బాండీలోనే పావు కిలో నెయ్యిలో కొంత వేసి అందులో కట్ చేసుకున్న డ్రైఫ్రూట్స్, 2 టేబుల్ స్పూన్ల ఖర్బూజ గింజలు కూడా వేసి 1 నిమిషం తక్కువమంట మీద వేయించి తీసి పక్కన పెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద బాండీలో ఇంకొంచెం నెయ్యి వేసి వేడి చేశాక ఇందులో 100 గ్రాముల గోంద్(అకాసియా గమ్)వేసి వేయించాలి. గోంద్ వేగి సగ్గుబియ్యంలా పొంగుతుంది. అప్పుడు దాన్ని తీసి ఓ ప్లేట్ లో పెట్టుకోండి. -వేయించిన గోంద్ చల్లారిన తర్వాత దాన్ని మిక్సీ గిన్నెలో వేసి 2-3 సార్లు పల్స్ ఇస్తూ చేసుకుంటే చాలు. -ఇప్పుడు స్టవ్ మీద బాండీలొ ఇంకొంచెం నెయ్యి వేసి వేడి చేసి అందులో 100 గ్రాముల గోధుమ పిండి వేసి మంచి రంగు,సువాసన వచ్చేదాకా కలుపుతూ వేపుకోవాలి. -గోధుమపిండి మంచి సువాసన వస్తున్న సమయంలో దాన్ని వేయించి అన్నీ పెట్టుకున్న ప్లేట్ లో వేసేయండి. మక్సీలో పల్స్ చేసుకున్న గోంద్ కూడా ఇందులో వేసి మొత్తం అన్నీ కలిసేలా కలుపుకోండి. -తర్వాత స్టవ్ మీద బాండీలో ఇంకొంచెం నెయ్యి వేసి అందులో 250 గ్రాముల బెల్లం తరుము వేసి ఓ తీగ పాకం వచ్చేదాకా మరిగించాలి. పాకం చిక్కగా ఉన్నప్పుడు అందులో అర టేబుల్ స్పూన్ యాలకల పొడి,అర టేబుల్ స్పూన్ సొంటి పొడి వేసి బాగా కలిపి స్టవ్ ఆపేసేయండి. -ఇప్పుడు బెల్లం పాకంలో వేయించిన పదార్థాల మిశ్రమం మొత్తం వేసేసి బాగా కలిపి 5 నిమిషాలు పక్కన ఉంచండి. -మిశ్రమం కొంచెం వేడిగా ఉన్నప్పుడే చేతికి నెయ్యి రాసుకొని కొంచెం కొంచెం మిశ్రమాన్ని తీసుకొని అడ్డూల్లా చుట్టుకోండి. అంతే గోంద్ లడ్డు రెడీ.

## ఘాటుగా,కారంగా..మిగిలిపోయిన అన్నంతో ఘుమఘుమలాడే తమలపాకు రైస్



మిగిలిపోయిన అన్నంతో ఎగ్ ఫ్రైడ్ రైస్, పులిహోర,టమాటో రైస్ వంటివి చేసుకునే బదులు ఓ సారి తమలపాకు రైస్ రెసిపిని ట్రై చేయండి. ఘాటుగా కారంగా ఘుమఘుమలాడుతూ చాలా రుచిగా ఉంటుంది తమలపాకు రైస్. మిగిలిపోయిన అన్నం అనే కాదు అప్పటికప్పుడు వండిన అన్నంతో కూడా ఇది ప్రిపేర్ చేసుకోవచ్చు. లంచ్ బాక్సులకి కూడా పర్ఫెక్ట్ గా ఉంటుంది. ఆరోగ్యానికి బోలెడంత మేలు చేసే తమలపాకులతో చేసే ఈ రైస్ ని మీ ఇంట్లోనే సులభంగా ఎలా ప్రిపేర్ చేసుకోవాలో ఇక్కడ చూడండి. తమలపాకు అన్నం తయారీకి కావాల్సిన పదార్థాలు -పల్లీలు -ఎండుమిర్చి -తమలపాకులు -ఉల్లిపాయలు -ఆయిల్ -ఉప్పు -పసుపు -జీలకర్ర -ఆవాలు -నువ్వులు -మినపప్పు -వెల్లుల్లి.

**తమలపాకు రైస్ తయారీ విధానం** -ముందుగా స్టవ్ మీద గిన్నె పెట్టి అందులో 10 వెల్లుల్లి రెబ్బలు, 2 టేబుల్ స్పూన్ల మినపప్పు వేసి మినపప్పు మంచి సువాసన వచ్చి రంగు మారే సమయంలో ఇందులో 5 ఎండుమిరపకాయలు వేసి వేపండి. -ఇప్పుడు అందులో రెండున్నర టేబుల్ స్పూన్ల నువ్వులు వేసి చిట్లనిచ్చి స్టవ్ ఆఫ్ చేసేయండి. -తర్వాత ఈ మిశ్రమం మొత్తాన్ని మిక్సీ గిన్నెలో వేసి మెత్తని పొడిగా గ్రైండ్ చేసుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద అదే గిన్నె పెట్టి అందులో 4 టేబుల్ స్పూన్ల ఆయిల్ పోసి వేడి చేసి అందులో పావు కప్పు పల్లీలు వేసి ఎర్రగా వేగనిచ్చాక ముప్పావు టీస్పూన్ జీలకర్ర, ముప్పావు టీస్పూన్ ఆవాలు, 1 కప్పు ఉల్లిపాయ తరుగు, రుచికి సరిపడా ఉప్పు, చిటికెడు పసుపు వేసి వేపుకోండి.ఉల్లిపాయలు మెత్తబడిన తర్వాత అందులో 5 తమలపాకుల సన్నని తరుగు వేసి మూడు నిమిషాలు వేపుకోండి. ఎక్కువగా వేపితే తమలపాకుల్లోని ఘాటు,సువాసన పోతాయని గుర్తుంచుకోండి. -తర్వాత అందులో వండిన అన్నం లేదీ మిగిలిపోయిన అన్నం,గ్రైండ్ చేసుకున్న పొడి వేసి పెద్ద మంట మీద 2-3 నిమిషాలు కలబెడుతూ ఉండండి. తర్వాత స్టవ్ ఆఫ్ చేసేయండి. అంతే తమలపాకు అన్నం రెడీ.

## టీ,కాఫీ బదులు ఇది 1 కప్పు తాగితే చాలు.. జన్మలో హాస్పిటల్ గుమ్మం తొక్కరు!



నగ్గుబియ్యం మఖానా ఖీర్ తయారీకి కావాల్సిన పదార్థాలు -పాలు -బెల్లం -సగ్గుబియ్యం -మఖానా -బాదంపప్పు -పిస్తాపప్పు -నెయ్యి -యాలకలు -కుంకుమ పువ్వు

నగ్గుబియ్యం మఖానా ఖీర్ తయారీ విధానం -ముందుగా పెద్ద సైజులో ఉండే అరకప్పు సగ్గుబియ్యం కనీసం 2 గంటలు నీళ్లలో నానబెట్టండి. -తర్వాత స్టవ్ మీద ఓ గిన్నె పెట్టి అందులో అరకప్పు తురిమిన బెల్లం వేసి,ఇందులోనే పావు కప్పు నీళ్లు పోసి బెల్లాన్ని కరిగించాలి. జస్ట్ బెల్లం కరిగిన తర్వాత 1 నిమిషం వేడి చేసా గిన్నెను పక్కనపెట్టుకోండి. -తర్వాత స్టవ్ మీద పాన్ పెత్తి అందులో 1 టీస్పూన్ నెయ్యి వేసి వేడి చేశాక 1 కప్పు పూల్ మఖానా వేసి ఫ్రై చేసుకోండి. 3-4 నిమిషాలు కలుపుతూ బాగా ఫ్రై చేసిన తర్వాత వీటిని ఓ ప్లేట్ లోకి తీసి పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద ఉన్న పాన్ లోనే మూడున్నర కప్పుల పాలు(750 %ఎశ్రీ%) పోసి అవి పొంగువచ్చేదాకా మరిగించుకోవాలి. -పాలు మరగడం ప్రారంభమయ్యాక అందులో నానబెట్టిన సగ్గుబియ్యం వేసి కలపండి. ఇందులో కొంచెం కుంకుమ్మ పువ్వు కూడా వేసి బాగా కలుపుతూ ఉడికించాలి -ఇదే సమయంలో ఓ మిక్సీ గిన్నెలో 10 బాదంపప్పులు, 1 టీస్పూన్ పిస్తా పప్పు, 4 యాలకలు వేసి మెత్తని పొడిలా గ్రైండ్ చేసుకోండి. -సగ్గుబియ్యం ఉడికిన తర్వాత అందులో గ్రైండ్ చేసుకున్న బాదం పిస్తా పొడిని వేసి బాగా కలిపి 1-2 నిమిషాలు ఉడికించాక ఇందులో సన్నగా తరిగిన 5 బాదంపప్పు ముక్కలు,ఫ్రై చేసి ఉంచిన పూల్ మఖానా వేసి బాగా కలిపి స్టవ్ ఆఫ్ చేసేయండి. -కొద్దిగా చల్లారిన తర్వాత ఈ పాయసంలో ముందుగా తయారుచేసుకున్న బెల్లం సిరప్ ని వడకట్టి పోసి బాగా కలపండి. అంతే టేస్టీ సగ్గుబియ్యం మఖానా ఖీర్ రెడీ.






## చూపులతోనే హృదయాలు దోచుకుంటున్న అనుపమ!



అనుపమ పరమేశ్వరన్ ఈ మధ్యకాలంలో ఏం చేసినా అది సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గానే నిలుస్తోంది. టిల్లు స్క్వేర్ మూవీతో తన రూట్ మార్చిన ఈ ముద్దుగుమ్మ వరుస ఫోటోషూట్స్, వరుస సినిమాలతో ఊపు మీద ఉంది. అయితే అలాంటి ఈ ముద్దుగుమ్మ తాజాగా తన ఇన్స్టా ఫోటోలతో మరోసారి స్పెషల్ మీడియాలో హైలెట్ గా నిలిచింది. తాజాగా ఎల్లో కలర్ క్రాప్ టాప్ లో ఉన్న ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇందులో గోల్డెన్ కలర్ టాప్ ఎల్లో కలర్ బాటమ్ తో ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. స్లీవ్ లెస్ గోల్డెన్ కలర్ టాప్ లో తళుక్కుమని మెరిసిపోతుంది.. అంతేకాదు చెవులకు పెద్ద చెవి దుద్దులను పెట్టి తన లుక్ లో చెవి దుద్దులనే హైలెట్ చేసింది. రింగుల జుట్టుతో మత్తెక్కించే కళ్ళతో ఉన్న ఈ ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తున్నాయి. ఈ హాట్ ఫోటోలను చూస్తే ఎవరైనా సరే అనుపమ అందానికి ఫిదా అవ్వాల్సిందే. అలా ఫోటోలతో కుర్రకారు గుండెల్లో మంట పెట్టిన అనుపమ పరమేశ్వరన్ ఇలాంటి ఫోటోల వల్లే సోషల్ మీడియాలో మరింత ఫేమస్ అవుతుంది. ముఖ్యంగా ఈ హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో సాంప్రదాయమైన లుక్ తో అందరినీ కట్టిపడేసింది. కానీ రాను రాను అందరిలాగే ఈ హీరోయిన్ కూడా తయారైంది అనేలా కొన్ని విమర్శలు ఎదుర్కుంది. ఎందుకంటే సినిమాల్లోకి వచ్చినా కొత్తలో అనుపమ పరమేశ్వరన్ ఒక్క సినిమాలో కూడా బోల్డ్ పాత్రలో నటించలేదు. పొట్టి బట్టలు వేసుకోలేదు. కానీ రౌడీ బాయ్స్ సినిమాతో రూట్ మార్చేసింది. ఈ సినిమాలో కాస్త బోల్డ్ గా నటించడంతోపాటు రొమాంటిక్ సన్నివేశాల్లో రెచ్చిపోయి నటించింది. దాంతో ఈ హీరోయిన్ ని ఇలాంటి పాత్రలో కూడా తీసుకోవచ్చని దర్శక నిర్మాతలకు ఓ క్లారిటీ వచ్చింది. డీజే టిల్లు సినిమాకి సీక్వెల్ గా వచ్చిన టిల్లు స్క్వేర్ సినిమాలో మాత్రం పూర్తి బోల్డ్ గా కనిపించింది. పొట్టి పొట్టి బట్టలు వేయడంతో పాటు లిప్ లాక్ లతో రెచ్చిపోయి అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే అప్పటివరకు ఈ హీరోయిన్ ని అభిమానించిన అభిమానులు కూడా ఇదేంటి ఈ హీరోయిన్ ఇలా మారిపోయింది అని నోరెళ్లబెట్టి టిల్లు స్క్వేర్ సినిమాలో ఆమె పర్ఫామెన్స్ ను చూసి షాక్ అయిపోయారు. అయితే అలాంటి అనుపమ పరమేశ్వరన్ టిల్లు స్క్వేర్ సినిమా తర్వాత బోల్డ్ పాత్రలకు కూడా ఓకే చెప్పి మరిన్ని అవకాశాలు అందుకుంటుంది. అలా ఈ హీరోయిన్ టిల్లు స్క్వేర్ మూవీ తర్వాత పరదా అనే లేడీ ఓరియంటెడ్ మూవీ తో వచ్చింది. పరదా అనే డిఫరెంట్ కాన్సెప్ట్ ఉన్న మూవీని ఎంచుకొని సమాజంలో ఆడవాళ్లు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి ఈ సినిమాలో చూపించగా.. అందులో అద్భుతంగా నటించింది. కానీ ఈ సినిమా పెద్దగా విజయం సాధించలేదు. ఆ తర్వాత వెంటనే బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో కిష్కింధపురి అనే మూవీ తో వచ్చి దెయ్యం పాత్రలో అందర్నీ భయపెట్టేసింది.

## ఐదేళ్ల తర్వాత చేతిలో... హీరోయిన్ ఆనందం!




తెలుగు ప్రేక్షకులకు తునీగా తునీగా సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ రియా చక్రవర్తి. తెలుగులో ఈమె పెద్దగా సినిమాలు చేయకున్నా హీరో సుశాంత్ సింగ్ రాజ్‌పూత్ ఆత్మహత్య తర్వాత దేశం మొత్తం ఈమె పేరు పాపులర్ అయింది. సుశాంత్ ప్రియురాలు రియా చక్రవర్తి అనే విషయం చాలా మందికి తెలుసు. దాంతో ఆమె వల్లే సుశాంత్ చనిపోయాడు అంటూ పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఆ సమయంలో దేశవ్యాప్తంగా రియా చక్రవర్తిపై విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా రియా చక్రవర్తి స్వయంగా డ్రగ్స్‌ను తెప్పించి సుశాంత్‌కి అలవాటు చేసి, అతడు ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించింది అంటూ కేసు కూడా నమోదు అయింది. ఇన్నాళ్లు విచారణ జరిగిన విషయం తెల్సిందే. కేసు విచారణలో ఉన్న కారణంగా రియా చక్రవర్తి ఇన్నాళ్లు మీడియా ముందుకు పెద్దగా రాలేదు, విదేశాలకు వెళ్లే అవకాశం దక్కలేదు. రియా చక్రవర్తి తాజాగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకుంది. రియా చక్రవర్తి సోషల్ మీడియాలో తన ఆనందంను అందరితోనూ పంచుకుంది. ఐదేళ్ల తర్వాత నా పాస్‌పోర్ట్ నా చేతికి వచ్చింది. నేను గత ఐదేళ్ల కాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ముఖ్యంగా నా పర్సనల్ జీవితంలో ఎన్నో విషయాల పట్ల రాజీ పడాల్సి వచ్చిందని సన్నిహితుల వద్ద రియా ఆవేదన వ్యక్తం చేస్తూ కామెంట్స్ చేసింది. కేసు విచారణ జరుగుతున్న సమయంలో రియా కు విదేశీ ప్రయాణంకు అనుమతి ఇవ్వలేదు. పాస్ పోర్ట్‌ను స్వాదీనం చేసుకున్న కోర్ట్ ఎట్టకేలకు రియాకు ఆమె పాస్ పోర్ట్‌ను తిరిగి ఇవ్వడం జరిగింది. దాంతో రెక్కలు వచ్చిన పక్షి మాదిరిగా మళ్లీ రియా చక్రవర్తి విదేశాల్లో ప్రయాణించే అవకాశం దక్కిందని ఆమె సన్నిహితులు, ఇండస్ట్రీ వర్గాల వారు మాట్లాడుతున్నారు. తన పాస్‌పోర్ట్ రావడంతో సెకండ్ ఇన్నింగ్స్‌ను మొదలు పెడతాను అంటూ రియా చక్రవర్తి ఇన్‌స్టాగ్రామ్‌లో తన పాస్‌పోర్ట్ ను చేతిలో పట్టుకుని ఉన్న ఫోటోను షేర్ చేసింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసిన ఫోటో వైరల్ అవుతోంది. సుశాంత్ సింగ్ రాజ్ పూత్ చనిపోయి దాదాపుగా అయిదు ఏళ్లు పూర్తి అవుతుంది. అయినా కూడా ఆయన అభిమానులు ఇప్పటికీ ఆవేశంతోనూ ఊగిపోతున్నారు. రియా చక్రవర్తిని ఇప్పటికీ దోషిగానే చాలా మంది భావిస్తున్నారు. అందుకే ఈమె పాస్‌పోర్ట్ ఫోటోను షేర్ చేసిన వెంటనే తమదైన శైలిలో విరుచుకు పడ్డారు. అన్యాయంగా ఒక మంచి వ్యక్తి చనిపోవడంకు మీరు కారణం అంటూ కొందరు కామెంట్స్ చేస్తే, కొందరు ఈ విషయంలో మీరు ఇప్పటికి అయినా పశ్చాతాపం పడుతున్నట్లుగా అనిపించడం లేదు అంటూ కొందరు ఆమెను టార్గెట్ చేసి కామెంట్ చేశారు. మేరే డాడ్ కి మారుతి సినిమాతో బాలీవుడ్‌లో అడుగు పెట్టిన రియా చక్రవర్తి వరుస సినిమాలు చేయాలని ఆశ పడింది. కానీ సుశాంత్ సింగ్ రాజ్‌పూత్ ఇష్యూ కారణంగా రియా చక్రవర్తికి సినిమా ఆఫర్లు రాలేదు. ఆ మధ్య సోషల్ మీడియా ద్వారా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా తాను మళ్లీ సినిమాల్లో నటించేందుకు రెడీగా ఉన్నాను, అందంగా, గ్లామర్‌గా కనిపించేందుకు రెడీ అన్నట్లుగా సిగ్నల్ ఇచ్చింది. కానీ ఏ ఒక్క ఆఫర్ ఈమె తలుపు తట్టలేదు. ఇదే సమయంలో ఈమె బిగ్‌బాస్ తో రీ ఎంట్రీ ఇస్తే అందరి దృష్టిని ఆకర్షించవచ్చు అని భావించిందట. బిగ్‌బాస్ లోకి వెళ్లేందుకు ఆమెకు కోర్ట్ నుంచి ఇబ్బందులు ఉండటంతో అక్కడకు వెళ్లలేని పరిస్థితి ఉంది. మొత్తానికి రియా చక్రవర్తి మెల్ల మెల్లగా ఆ ఇబ్బందుల నుంచి బయట పడుతుంది. కనుక సినిమాల్లో బిజీ అవుతుందేమో చూడాలి.

## పారిస్ ఫ్యాషన్ వీక్ లో సందడి చేసిన జాక్వెలిన్.. అందాలతో రెచ్చగొడుతూ!



బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండేజ్ తాజాగా పలు దేశాలలో నిర్వహించే ఫ్యాషన్ వీక్ లలో పాల్గొంటూ తన అంద చందాలతో అక్కడివారిని అట్రాక్ట్ చేస్తోంది. ఈ అంతర్జాతీయ ఫ్యాషన్ వేదికలు ప్రపంచవ్యాప్తంగా ఉండే డిజైనర్లకు మాత్రమే కాకుండా రన్ వే లేదా రెడ్ కార్పెట్ పై నడిచే సెలబ్రిటీలకు ప్రత్యేక ఉనికిని తీసుకువచ్చి పెడతాయి. అలా తాజాగా లండన్ ఫ్యాషన్ వీక్ లో మెరిసిన జాక్వెలిన్ ఫెర్నాండేజ్ పారిస్ ఫ్యాషన్ వీక్ లో కూడా మెరిసింది. అయితే ఈ పారిస్ ఫ్యాషన్ వీక్ లో తన అందంతో అక్కడున్న వారిని ఆకట్టుకుంది జాక్వెలిన్ ఫెర్నాండేజ్.. నల్లటి పొడవాటి గౌనుని ధరించిన జాక్వెలిన్ డీప్ వీ నెక్ లైన్ తో తన ఎద అందాలను హైలెట్ చేస్తూ.. చూసే ఆడియన్స్ కి నిద్రలేకుండా చేసింది. అలాగే నడుము వద్ద మెరిసే రత్నపు క్లాస్ప్ తో ఉన్న ఫ్యాబ్రిక్ ఆమె అందానికి మరింత హైలెట్ గా నిలిచింది. ఈ బ్లాక్ కలర్ పొడవాటి డ్రెస్ కి అనుగుణంగా ఉండే హెయిర్ స్టైల్ ని ఎంచుకుంది. హెవీ హెయిర్ స్టైల్ కాకుండా పోనీటేల్ వేసుకొని చెవులకు చెవి పోగులు పెట్టుకోవడంతోపాటు చేతి వేళ్లకు ఉంగరాలు కూడా పెట్టుకొని లుక్ ని హైలెట్ చేసింది.. ఇకపోతే ఇలాంటి అంతర్జాతీయ ఫ్యాషన్ వీక్ ల కారణంగా జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాదిస్తోంది. తన లుక్ తో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకోవడం తోపాటు భారతీయ సినిమా, కళాత్మకతకు ప్రతినిధిగా నిలుస్తోంది..ఓపక్క అంతర్జాతీయ ఫ్యాషన్ వీకుల్లో పాల్గొం టూ తన ఉనికిని చాటుకుంటూనే మరో పక్క పలు సినిమాలు కూడా చేస్తూ హీరోయిన్ గా రాణిస్తోంది. ఈమె రీసెంట్ గా పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు సినిమాల్లో కనిపించింది. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏఎం రత్నం నిర్మించిన ఈ చిత్రంలో తన అద్భుతమైన పర్ఫామెన్స్‌తో అందరి దృష్టిని ఆకట్టుకుంది.అలాగే జాక్వెలిన్ ఫెర్నాండేజ్ వివాదాల విషయానికి వస్తే..ఆర్థిక నేరగాడు సుఖేష్ చంద్రశేఖర్ దగ్గరవిలువైన బహుమతులు అందుకొని మనీలాం డరింగ్ కేసులో కూడా ఇరుక్కున్న సంగతి మనకు తెలిసిందే. ఇకపోతే ఈ కేసును కొట్టివేయాలి అని ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఈమెకు అక్కడ కూడాఎదురుదెబ్బే తగిలింది ముఖ్యంగా సుఖేష్ చంద్ర 250 కోట్ల మనీ లాండరింగ్ కేసులో ఈమె హస్తం ఉందని.. ముఖ్యంగా సుకేశ్ చంద్ర జైల్లో ఉన్నప్పటికీ ఈమెకు కోట్ల రూపాయల విలువ చేసే బహుమతులు అందించారని.. సాక్షాలతో సహా అధికారులు సుప్రీంకోర్టుకు సమర్పించడంతో ఈమె పిటిషన్ ని సుప్రీంకోర్టు కొట్టి వేసింది. మరి ఈ కేసు నుంచి జాక్వెలిన్ అసలు బయట పడుతుందా? లేదా? అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

## వరుస ఫ్లాప్స్ .. శ్రీదేవి కూతురిని టాలీవుడే కాపాడాలి?



గత కొన్ని రోజులుగా జాన్వీకపూర్ వరుస డిజాస్టర్లు మూటగట్టుకుంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా బాలీవుడ్లో ఇటీవల 'పరమ్ సుందరి' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె.. ఈ సినిమాతో భారీ డిజాస్టర్ ను మూటగట్టుకుంది. ఆ తర్వాత 'హెూమ్ బౌండ్' అంటూ మళ్ళీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈ సినిమాకు సరైన ప్రమోషన్స్ లేకపోవడం వల్లే ఈ చిత్రం విడుదల అయిన విషయం కూడా చాలామందికి తెలియదు అని చెప్పాలి. అలా ఈ సినిమా మొదటి రోజు కేవలం 30 లక్షలు మాత్రమే వసూలు చేసి డిజాస్టర్ గా నిలిచింది. అయితే ఈ సినిమా ఆస్కార్ ప్రదర్శనకు ఎంపికైన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా మరొకవైపు కరణ్ జోహార్ నిర్మాణంలో వచ్చిన 'సన్నీ సంస్కారికీ తులసీ కుమారి' సినిమాలో కూడా నటించింది. వరుణ్ ధావన్ హీరోగా నటించారు.. భారీ అంచనాల మధ్య పెద్ద ఎత్తున ప్రమోషన్స్ తో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. అక్టోబర్ 2న విడుదలైన ఈ సినిమా కథ రొటీన్ కథ కావడంతో ప్రేక్షకులు దీనిని ఆదరించలేకపోతున్నారు. ఇలా వరుసగా బాలీవుడ్ లో మూడు చిత్రాలు చేస్తే మూడు చిత్రాలు కూడా డిజాస్టర్ కావడం ఆశ్చర్యంగా మారింది. అయితే ప్రస్తుతం అమ్మడి చూపు టాలీవుడ్ పైనే పడింది అని చెప్పడంలో సందేహం లేదు. విషయంలోకి వెళ్తే.. గత ఏడాది కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన చిత్రం దేవర.

Printed, Published and Owned by PENAGONDA SATHISH,Printed at BUILDING NO: 1-17-18, SVN COLONY, SUNDAY PRINTING PRESS,Editor: PENAGONDA SATHISH,: H NO : 8-4-458, RAM NAGAR, GODAVARIKHANI, PEDDAPALLI, TELANGANA - 505209. RNI.No.TGTEL/25/A1964,Cell : 8333818121,Email: akankshanewsdaily@gmail.com